
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 08.01.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 32 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## అతిథులొచ్చారు



11లో

# జిల్లాకు పండుగ తెచ్చారు

ఇసుకపై...

# మళ్లీ మస్కా

### కోట్ల రూపాయల దోపిడీ ముగిశాక తిరిగి పాతపాటే

**ఆంధ్రప్రదేశ్‌లో అధికార దోపిడీకి ప్రధాన మార్గాలు... అమరావతి రాజధాని పేరుతో, సెజ్‌ల పేరుతో భూముల దోపిడీ... మహిళా సంఘాల పేరుతో ఇసుక దోపిడీ... పుష్కరాల పేరుతో వేలకోట్ల దోపిడీ... పట్టిసీమ పేరుతో నిలువు దోపిడీ... ఇక అధికారుల బదిలీలలో అవినీతి సంగతి సరేసరి! రాష్ట్రంలో ప్రభుత్వం లైసెన్స్‌లిచ్చేసినట్లుగా పై విషయాలలో దోపిడీ కార్యక్రమాలు యధేచ్ఛగా జరిగిపోతున్నాయి.**

వీటన్నింటిలోకల్లా ప్రత్యక్షంగా కోట్ల రూపాయల డబ్బు కనిపించేది ఇసుక దోపిడీలోనే! 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అప్పటిదాకా వున్న ఇసుక టెండర్ల విధానానికి స్వస్తి పలికారు. ఇసుకలో ఏదో అద్భుతాలు చేద్దామని ఇసుక రీచ్‌లను మహిళా సంఘాలకు అప్పగించారు. అయితే పేరుకే మహిళా సంఘాలు. ఇసుకరీచ్‌లు నిర్వహించిందంతా అధికార పార్టీ నాయకులే! ముఖ్యంగా రీచ్‌లు ఏ నియోజకవర్గ పరిధిలో వుంటే ఆ ప్రాంత అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు యధేచ్ఛగా ఇసుక (మిగతా 11వ పేజీలో)

- ✓ విమానాశ్రయం
- ✓ నూతన సెజ్ ✓ ట్యాంక్ బండ్
- ✓ త్రై ఇండస్ట్రియల్ హబ్ ✓ కామధేను ప్రాజెక్ట్
- ✓ హడ్కో నిధులు ✓ దుగరాజపట్నం పోర్ట్
- ✓ వికలాంగుల శిక్షణ కేంద్రం ✓ క్రిబ్‌కో
- ✓ పర్యాటక అభివృద్ధి
- ✓ బ్యారేజీల పూర్తి

ఇవన్నీ జరిగితే...

# నెల్లూరు మహానగరమే!

### ■ అరచేతిలో స్వర్గం చూపిన జంట నాయకులు

*ఈ నెల 3వ తేదీన నెల్లూరుజిల్లాలో పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖా మంత్రి యం.వెంకయ్యనాయుడులిచ్చిన హామీలివి. ఇద్దరు నాయుడులు కూడా మొన్నటి పర్యటనలో సింగపూర్‌ను తలదన్నే రీతిలో సింహపురి నగరాన్ని మహానగరిగా తీర్చిదిద్దుతామని గట్టిగా చెప్పారు. నిజంగా ఈ నాయకులిద్దరు ఇచ్చిన హామీలు అమలైతే సింహపురి సింగపూర్ కావడం మాటేమోగాని కనీసం నగరంలో నెలకొన్న కొన్ని సమస్యలన్నా తీరి నగరానికి ఒక రూపురేఖన్నా వస్తుందని ప్రజల ఆశ.*

నాయకుల హామీలను ప్రజలు అంతగా విశ్వసించరు. ఎందుకంటే వంద వాగ్దానాలు చేస్తే వాటిలో పదింటిని అమలు చేసేసరికే తల ప్రాణం తోకకు వస్తుంది. అలాంవి వంద వాగ్ధానాలు అమలు కావాలంటే తరాలు మారాల్సిందే! (మిగతా 11వ పేజీలో)



# ఇంటింటా ఎల్ఇడి వెలుగులు



- రూ.20కే రెండు ఎల్ఇడి బల్బులు
- విద్యుత్ ఆదాకు ఇదో మంచి మార్గం

ఎల్ఇడి బల్బులను వినియోగించుకోవడం ద్వారా వినియోగదారులు విద్యుత్‌ను బాగా ఆదా చేసుకోవచ్చు. అందువల్ల ప్రజల్లో వీటి వాడకానికి విస్తృత ప్రచారం కల్పించేందుకు విద్యుత్‌శాఖ ముమ్మర కృషి చేస్తోంది. విలువైన రెండు ఎల్ఇడి బల్బులను తక్కువ ధరకే ఇచ్చి తద్వారా విద్యుత్ పొదుపుకు మార్గం చూపుతూ వినియోగదారునికి మంచి సేవ లందిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం నెల్లూరు రామ్మూర్తినగర్‌లో వున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విచ్చేసిన ట్రాన్స్‌కో సి.ఇ నందకుమార్ వాటి వినియోగం గురించి అధికారులకు తెలియజేశారు. ఎపిఎస్‌పిడిసిఎల్, డిఇఎల్‌పి, ఇఇఎస్ఎల్ శాఖల ద్వారా కేవలం ఇంటి సర్వీసులకు మాత్రమే రాయితీతో ఈ ఎల్ఇడి బల్బులు ఇస్తారన్నారు. ఇళ్ళ విద్యుత్ వినియోగంలో నాణ్యత పాటించి పొదుపు చర్యలు తీసుకునేందుకే ప్రతి ఇంటికీ రెండు ఎల్ఇడి బల్బులను రాయితీతో కేవలం ఇరవై రూపాయలకే అందిస్తున్నామన్నారు. ఈ బల్బులకు మూడేళ్ళ వారెంటీ ఇస్తామని, ఈ బల్బులతో అధిక ఆదా వుంటుందని, విద్యుత్‌బిల్లు గణనీయంగా తగ్గిపోతుందని అన్నారు. 9 మెగావాట్ల ఎల్ఇడి బల్బు 60 వాట్ల సాధారణ బల్బుతో సమానమని, వినియోగదారులు ఇటీవల కరెంట్‌బిల్లు చెల్లించిన రశీదు, ఆధార్‌కార్డుతో సమీప ప్రాంతంలోని సెక్షన్ కౌంటర్‌లో ఒక బల్బుకు పది రూపాయల వంతున చెల్లించి పొందవచ్చని, అయితే వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి విక్రయించుకోరాదని ఆయన స్పష్టం చేశారు. ఈ బల్బ్‌ల వల్ల ఏడాదికి 500 నుంచి 700రూపాయల దాకా ఆదాయం పొందే అవకాశం వుందని తెలిపారు. 800 రూపాయల విలువైన బల్బులను కేవలం 20 రూపాయలకే అందిస్తున్నామన్నారు. నెల్లూరు నగరంలోని 10 సబ్‌స్టేషన్లలో ప్రతి ఇంటి వినియోగదారునికీ ఈ బల్బులు అందుబాటులో వుంటాయని, ప్రతి వినియోగదారుడు వీటిని వినియోగించుకుని విద్యుత్తును ఆదా చేయాలని ఆయన కోరారు. నెల్లూరు నగరంలోని పొదలకూరురోడ్డు మిలినియం సబ్‌స్టేషన్‌లో ఎల్ఇడి బల్బుల పంపిణీ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఇ నాగశయనరావు, టెక్నికల్ డి.ఇ వెంకటేశ్వర రావు, అధికారులు సంజయ్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సౌకర్యాన్ని వినియోగదారులందరూ సత్వరం వినియోగించుకుని విద్యుత్ ఆదా చేయడం ఎంతైనా మంచిదే!..

# బీమా ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి

**------------------------- నెల్లూరు ఎంపి మేకపాటి**

జీవిత బీమా పాలసీదారుల, ఏజెంట్ల సమస్యలను పార్లమెంటు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులో మంగళవారం జరిగిన లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫి) 7వ సర్వసభ్య సమావేశంలో యంపి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాలసీదారుల బోనస్ పెంచేందుకు కమీషన్‌తో సంబంధం లేకుండా సర్వీసు ప్రాతిపదికన ఏజెంట్లకు రూ. 10లక్షల వరకు పెంచేందుకు కృషి చేస్తానన్నారు. లియాఫి నెల్లూరు డివిజన్(నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం) ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నెల్లూరు రూరల్, నగర ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, లియాఫి ఆల్ ఇండియా అధ్యక్షులు బిఎస్‌చారి, ప్రధానకార్యదర్శి ఎన్.గజపతిరావు, సౌత్‌సెంట్రల్ జోన్ కార్యవర్గం, మూడు జిల్లాల ఏజెంట్లు పాల్గొన్నారు.

***నూతన కార్యవర్గం :***

సమావేశం అనంతరం జరిగిన నూతన కార్యవర్గం ఎంపికలో డివిజన్ గౌరవాధ్యక్షులుగా జి.సతీష్‌బాబు, అధ్యక్షులుగా వివి సుబ్బారావు, కార్యదర్శిగా కె.వేణుగోపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఎన్నికల కార్యక్రమాన్ని వరంగల్, ఖమ్మం డివిజన్లకు చెందిన అధ్యక్షులు పద్మనాభయ్య, వెంకటరెడ్డిలు పర్యవేక్షించారు.

# రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



వెంకయ్యను గజమాలతో సత్కరిస్తున్న రజక నాయకులు

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలంటూ నెల్లూరుజిల్లా రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 2వతేదీ కేంద్ర మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు నివాసంలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు మన్నూరు శ్రీనివాసులు, పాతపాటి వీరరాఘవులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో 18 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీ తెగలో ఉన్నప్పటికి ఆంధ్ర రాష్ట్రంలో ఇప్పటివరకు రజకులను ఎస్సీ తెగలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కేంద్రమంత్రి వెంకయ్య స్పందించి రజకులను ఎస్సీ, ఎస్టీ కేటగిరిలో చేర్చేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు శివనారాయణ, దుర్గంపాటి పద్మజ, చిత్తూరు జగన్నాథం, పూడిపర్తి నరేంద్ర తదితర రజక కార్యకర్తలు పాల్గొన్నట్లు తెలిపారు.

# ఇరకం దీవికి త్వరలో పర్యాటక కళ

**పడవ మార్గాలను పరిశీలించిన ఎం.డి**

తడ మండలంలోని ఇరకం దీవికి త్వరలో పర్యాటక కళ రాబోతోంది. ఆ మేరకు పర్యాటకశాఖ తగు పరిశీలనలు చేపట్టింది. సోమవారం ఆ శాఖ ఎం.డి ప్రేమ్‌చంద్ ఇరకం దీవిలో పర్యటించారు కూడా. భీమునివారిపాళెం రేవు నుంచి ఆయన ప్రత్యేక పడవలో ఇరకం దీవికి చేరుకున్నారు. అక్కడినుంచి ట్రాక్టర్‌లో వెళ్ళి, పర్యాటకశాఖకు కేటాయించిన 80 ఎకరాల భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన భీమునివారిపాళెం నుంచి నేరుగా పర్యాటక కేంద్రానికి పడవలు చేరుకునే మార్గాలేమైనా వున్నాయా అని పరిశీలించారు. ఇప్పటికే అక్కడ తీగమార్గం ప్రతిపాదన వుండడంతో, ఆ విషయం కూడా ఆయన అక్కడి అధికారులతో చర్చించారు. మంచినీటి వసతులను ప్రస్తావిస్తూ, పర్యాటకులకు అవసరమైన మంచినీటి సదుపాయం కోసం నీటిశుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటుచేయాల్సి వుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ దీవిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు అమరేంద్రకుమార్, బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, వీరనారాయణ, జిల్లా పర్యాటక అధికారి నాగభూషణంతో పాటు స్థానిక సర్పంచ్ తేన్‌మొళి, ఎంపిటిసి కె. వాసు తదితరులు పాల్గొన్నారు.

**నివేదిక సరే..**

# పరిహారం ఏదీ?

**- ఆకుతోటల రైతుల ఆవేదన**

ఇటీవల భారీవర్షాల వల్ల కోవూరు, ఇందుకూరుపేట, నెల్లూరు రూరల్ మండలాల్లో ఆకుతోటలకు జరిగిన నష్టాలపై ఉద్యానశాఖ అధికారులు నివేదిక తయారుచేశారే కానీ, ఇంతవరకు రైతులకు పరిహారం మాత్రం అందలేదని ఆకుతోటల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఈ విషయంపై జిల్లా రైతు సంఘం, రైతు సంఘాల సమాఖ్యల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆకుతోట రైతులను తక్షణం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. వర్షాల వల్ల దెబ్బతిన్న ఆకుతోటల రైతాంగాన్ని, కౌలుదారులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాందోళనలో జిల్లా రైతుసంఘం నాయకులు రామరాజు, రైతు సంఘాల సమాఖ్య నాయకులు కోటిరెడ్డి, జి.ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్మగ్లింగ్ రూట్ మార్చిన డాన్‌లు

- పోలీసుల దాడిలో వెల్లడైన అక్రమ దారులు




ఇటీవలకాలంలో ఎర్రచందనం స్మగ్లర్లపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఈ ఒక్క విషయంలో మాత్రం కొంతమేర సక్సెస్ అయినట్లు కనిపిస్తోంది. నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన బడా స్మగ్లర్ల పీచమణిచారు. అక్రమరవాణాకు దారులు మూసుకుపోవడంతో స్మగ్లర్లు కొత్తమార్గాలపై దృష్టి పెట్టారు. నేరుగా ఎర్రచందనం దుంగల రవాణా కాకుండా, ఎర్రచందనం కొయ్యలతో బొమ్మలు చేసి ఆ రూపంలో స్మగ్లింగ్‌కు తెరతీశారు. అయితే పోలీసులు ఈ అక్రమమార్గాన్ని కనిపెట్టి ఓ రాటుదేలిన స్మగ్లర్‌ను పట్టుకున్నారు.

అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ అబ్దుల్ ఖలీల్ రెహమాన్(బాయ్)ను నెల్లూరుజిల్లా పొదలకూరు సిఐ శ్రీనివాసులు కలువాయి ఎస్సై కొండపనాయుడు, కృష్ణపట్నం పోర్టు ఎస్సై విశ్వనాథరెడ్డి చాకచక్యంగా గుమ్మడిపూడి సమీపంలో సోమవారం అరెస్టు చేశారు. అతని వద్ద 75ఎర్రచందనం దుంగలు, 18 యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 1.30కోట్లు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. మంగళవారం కలువాయి పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆత్మకూరు డిఎస్పీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత నెల 25వ తేదీన ఏడు మంది ఎర్రచందనం స్మగ్లర్‌లను అరెస్టు చేసామన్నారు. 31వ తేదీ చెన్నై, నెల్లూరు జిల్లాకు చెందిన మరో ఏడు మందిని అరెస్టు చేసామన్నారు. వారిచ్చిన సమాచారం మేరకు సిఐ శ్రీనివాసులు, ఎస్సైలు కొండపనాయుడు, విశ్వనాథరెడ్డి చెన్నైలో ఎర్రచందనం కొయ్యలతో బొమ్మలు చేసే పరిశ్రమలపై దాడి చేసినట్లు తెలిపారు. ఎర్రచందనంతో తయారుచేసే బొమ్మలను స్మగ్లర్ ఖలీల్ రెహమాన్ అంతర్జాతీయంగా ఎగుమతి చేస్తుంటాడన్నారు. వీరికి చెందిన మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులు నిర్వహించి అంతర్జాతీయ స్మగ్లర్లను పట్టుకున్న పొదలకూరు సిఐ శ్రీనివాస్, కలువాయి ఎస్సై కొండపనాయుడు, కృష్ణపట్నం పోర్టు ఎస్సై విశ్వనాథ్‌రెడ్డి, సిబ్బందికి నెల్లూరు జిల్లా ఎస్పీ డా॥ గజరావు భూపాల్ రివార్డులను ప్రకటించినట్లు డిఎస్పీ తెలిపారు.

**పేదల సేవ..**

# ప్రజాప్రతినిధుల బాధ్యత

**- తిరుపతి ఎంపి వరప్రసాద్‌రావు**

పేదలకు సేవ చేయడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని, ఆ బాధ్యతను విస్మరించరాదని తిరుపతి ఎంపి వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. ఈ నెల 2న పెళ్ళకూరు మండలంలోని శిరసనంబేడు గ్రామంలో నిర్వహించిన జన్మభూమి-మా వూరు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న పథకాలను అర్హులందరికీ అందేలా కృషి చేస్తున్నామన్నారు. స్థానిక రైతుల కోరిక మేరకు తెలుగుగంగ 7వ బ్రాంచ్ కాలువకు సాగునీరు విడుదల చేయిస్తామని, ఎండిపోతున్న ఎల్ది పైర్లను కాపాడేందుకు కృషి చేస్తామని అన్నారు. గ్రామంలో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్, పాఠశాల అదనపు భవనం నిర్మాణాలకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా, గ్రామ ముఖద్వారం ఏర్పాటుకు ఎంపి నిధుల నుంచి 5 లక్షలు మంజూరు చేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. అర్హులైన పేదలకు ఇళ్ళు, రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరుచేసే విషయంలో రాజకీయాలు చేయడం మంచిది కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీమంత్రి పరసా రత్నం మాట్లాడుతూ, విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన మన రాష్ట్రం ఎంతో ఇబ్బందుల్లో వున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను తెలుగుదేశం పార్టీ నిలబెట్టుకుంటోందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# పక్షుల పండుగకు సూక్ష్మస్వాగతం



నెల్లూరు జెండావీధికి చెందిన స్వర్ణకారుడు డాక్టర్ షేక్ ముసవ్వీర్ గతంలో స్వర్ణం, వెండితో అనేక సూక్ష్మరూపాలను తయారుచేసి అందరి మన్ననలు అందుకున్న విషయం విదితమే. ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా వివిధ ఆకారాల్లో 3 ఫ్లెమింగోలను 400 మి.గ్రా వెండితో తయారుచేసి పక్షుల పండుగకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముసవ్వీర్ మాట్లాడుతూ పక్షులను కాపాడదానికి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించడం ద్వారా త్వరలో ఈ ప్రాంతం ప్రఖ్యాత పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. దీన్ని తయారు చేయడానికి రెండురోజులు సమయం పట్టిందని, ఫ్లెమింగో ఎత్తు 1సెం.మీ, వెడల్పు 1 సెం.మీ అని ముసవ్వీర్ తెలిపారు.

### జాతీయ స్థాయి సైన్స్ కాంగ్రెస్‌లో

# రత్నం విద్యార్థి పవన్



నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ వారు గత నెల 27 నుండి 31వరకు ఛండీ ఘడ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి సైన్స్ పోటీలలో నెల్లూరు సరస్వతీనగర్‌లోని రత్నం కిషోర్ (సి.వి. రామన్) హైస్కూల్ విద్యార్థి తాటి గోవిందలక్ష్మీ నాగసాయి పవన్ విశేష ప్రతిభ చూపి అందరి ప్రశంసలు పొందాడు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి వచ్చిన దాదాపు 800మంది విద్యార్థుల్లో 16మంది ప్రతిభావంతులను ఎంపిక చేయగా వారిలో పవన్ ఒకరు కావడం నెల్లూరుకే గర్వకారణం. మాజీకార్పొరేటర్, వైసిపి నాయకుడైన తాటి వెంకటేశ్వర్లు కుమారుడే పవన్. నెల్లూరులో నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ వారు జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో పాల్గొని తన ప్రతిభతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో సైతం తన టాలెంట్ చూపించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయిలో కూడా తన సత్తా చాటాడు. "అబ్జర్వేషన్ ఆఫ్ థండర్స్ స్ట్రామ్" అనే అంశంపై పవన్ రూపొందించిన ప్రాజెక్ట్ అందరి మన్ననలందుకుంది. పవన్‌కు ఛండీఘడ్ యూని వర్శిటీయే ఇంటర్ నుండి పిహెచ్‌డి వరకు ఉచిత విద్యను అందించనుంది.

కాగా మంగళవారం నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి పవన్‌ను తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. నెల్లూరు ప్రతిభను జాతీయ స్థాయిలో చాటిన పవన్‌కు 'లాయర్' అభినందనలు.

## వింజమూరు పాఠశాలకు ఎన్నారై వితరణ




నెల్లూరుజిల్లా వింజమూరులోని జడ్పీ హైస్కూల్లో వసతుల కల్పనకు లండన్‌లో వైద్యుడిగా స్థిరపడిన వింజమూరుకు చెందిన తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి తనవంతు సాయం అందజేశారు. సోమవారం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నందున రూ.25వేలతో కుళాయిలు వేయించానన్నారు. ప్రహరి గోడ కోసం రూ.10వేల ఆర్థిక సాయం అంద జేసినట్లు తెలిపారు. తన కుమార్తె దీపిక ద్వారా ఈ మొత్తాన్ని ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థిగా తన పూర్వ విద్యార్థులతో అనుభవాలను గుర్తు చేసుకున్నారు. తిప్పిరెడ్డి చలమారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున పలు సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు నారపరెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సీతారామయ్య, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.



## టిఎన్ఎస్ఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సిఎం

రాష్ట్రంలో విద్యారంగానికి తమ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు సోమవారం ఉదయం ఆయన కావలిలోని రోడ్లు, రహదారుల విశ్రాంతి భవనంలో తెలుగునాడు విద్యార్థి సమాఖ్య (టిఎన్ఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమలనాయుడు ఆధ్వర్యంలో ముద్రించిన 2016 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు సంబంధించిన సమస్యలను టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

## విజయవాడకు ఆనం ఎక్స్‌ప్రెస్



ఇటీవలే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిన ఆనం సోదరులు తమ బలప్రదర్శనకు ముహూర్తం పెట్టారు. ఈ నెల 17వ తేదీన దాదాపు 4వేల మంది అనుచరులను ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశంలో చేర్పించడానికి రంగం సిద్ధం చేశారు. దీనికి గాను నెల్లూరు నుండి తమ అనుచరులను విజయవాడకు తీసుకెళ్లడానికి ప్రత్యేక రైలును కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆనం వివేకానందరెడ్డి గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. 17వ తేదీ ఉదయం 6.30గంటలకు నెల్లూరు రైల్వేస్టేషన్ నుంచి స్పెషల్ ట్రైన్ బయలుదేరుతుందని, ఇందులో తమ అనుచరులు, కార్యకర్తలందరూ విజయవాడకు బయలుదేరుతారని తెలిపారు. నెల్లూరురూరల్, నగరం నియోజకవర్గాలలో వున్న అనుచరులకు స్పెషల్ ట్రైన్‌ను కేటాయించగా, ఆత్మకూరు నియోజకవర్గ అనుచరులకు మాత్రం భారీ ఎత్తున బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఆనం బలప్రదర్శన ఎంతవరకు విజయవంతం అవుతుందో చూద్దాం!

## దాతల సహకారంతో పార్కుల నిర్మాణం



నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధి లోని 29వ డివిజన్‌లో గల చైతన్యపురిలో దాతల సహకారంతో పార్కు నిర్మాణానికి ఈ నెల 6వ తేదీన గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇప్పటికే రెండు పార్కులు వున్నాయని, మూడు నెలల క్రితం ఒక పార్కును అందంగా తయారుచేసి వాకింగ్ ట్రాక్‌ను కూడా ఏర్పాటు చేశామని, రెండో పార్కును కూడా 30రోజుల్లో పూర్తి చేసి ప్రారంభిస్తామని అన్నారు. అన్నీ ప్రభుత్వం చేయాలంటే కష్టమని, కొన్ని పనులు ప్రజల భాగస్వామ్యంతో కూడా చేసు కుంటూ పోవాలన్నారు. ఈ సందర్భంగా పార్కులో కమ్యూనిటీ హాల్, షటిల్ కోర్టు, చిల్డ్రన్స్ ప్లేగ్రౌండ్ నిర్మాణానికి ముందు కొచ్చిన మేఘన ఆటోమొబైల్స్ అధినేత రత్నంను ఎమ్మెల్యే సత్కరించారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, రత్నయ్య, సాయిసునీల్, లక్ష్మీరెడ్డి, సుబ్బారావు, కొండా రెడ్డి, శ్రీనివాసులునాయుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలకు ఇబ్బందిగా మారుతున్న ఇన్‌ఛార్జిలు

అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్ మంటకలుస్తోంది. వైకాపా ఎమ్మెల్యేలు ఉన్న చోట తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు జన్మభూమి వంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటుండడం, లేనిపోని బిల్డప్ ఇస్తుండడం ఎమ్మెల్యేలకు ఇబ్బందిగా మారుతోంది. తామే ఎమ్మెల్యేలమైనట్లు వీళ్లు ఫోజులు కొడుతూ అధికారులను దబాయిస్తుండడం వైకాపా ఎమ్మెల్యేలకు ఏమాత్రం మింగుడుపడడం లేదు. ఈ విషయంలోనే బుధవారం నాయుడుపేట మండలం అన్నమేడు జన్మభూమి సభలో వైసిపి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు మాజీఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యంకు గొడవ జరిగింది. ఈ సభలోనే మరో మాజీఎమ్మెల్యే పరసా రత్నం కూడా కూర్చుని వున్నాడు. అధికార హోదా లేకపోయినా అధికారపార్టీ నాయకులు అధికారిక కార్యక్రమాలకు హాజరవుతూ వాటిని గబ్బు పట్టిస్తున్నారు.

## మనల్ని మనమే సంస్కరించుకోవాలి

### - డా॥ మేడసాని మోహన్ ఉద్బోధ



పురుషార్థములైన ధర్మ, అర్థ, కామ, మోక్షాలు పరమార్థాలుగా భావించిన వారికి సంపూర్ణమైన పురోభివృద్ధి చేకూరు తుందని ప్రముఖ ఉపన్యాసకులు, తిరుపతి శ్రీనివాస వాఙ్మయ అధ్యయన సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ మేడసాని మోహన్ ప్రబోధించారు. బుధవారం నెల్లూరు టౌన్‌హాల్‌లో పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో ఆంధ్రమహాభారత ఉపన్యాసాలు ప్రారంభమయ్యాయి. మహా భారతంలోని ఆశ్రమ వాసపర్వం ప్రథమాశ్వాసంపై ఆయన ఉపన్యసిస్తూ ప్రతివ్యక్తి ఎప్పటికప్పుడు తన మనస్తత్వాన్ని, అంతరంగాన్ని సంస్కరించుకునే దిశగా ఆలోచనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న తూనికలు కొలతల శాఖ రిటైర్డ్ అధికారి పంచాగ్నుల వెంకట విశ్వనాథం మాట్లాడుతూ పద్యాల ఆవశ్యకతను నేటితరం చిన్నారులకు తెలియజెప్పేందుకు, ఆసక్తిని పెంపొందించేలా చిన్నారులకు పోటీలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. బెంగుళూరు విశ్వవిద్యాలయం విశ్రాంత తెలుగు ఆచార్యులు తంగిరాల వెంకటసుబ్బారావు మాట్లాడుతూ మహాభారత ఉప న్యాసాలు మానవులను మంచిమార్గంలో పయనింపజేసే సాధనాలన్నారు. సంస్థ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ కందుకూరి వీరేశలింగం పంతులు గురించి వివరించారు.

తొలుత మహాకవి తిక్కన చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతిప్రకాశనం చేసి కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు ప్రారం భించారు. ఉపన్యాసకులను, ముఖ్యఅతిథులను సంస్థ సభ్యులు ఘనంగా శాలువాలతో సత్కరించారు. సంస్థ కోశాధికారి బి.వి. నరశింహం పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎం.వేణుగోపాలయ్య సంయుక్త కార్యదర్శి సి.హెచ్. వెంకటేశ్వరరావు, సభ్యులు నలుబోలు బలరామయ్యనాయుడు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# 'పఠాన్‌కోట్'.. ఓ గుణపాఠం

పఠాన్‌కోట్‌పై ఉగ్రదాడి మనకే కాదు..ప్రపంచానికంతటికీ ఒక గుణపాఠమనే చెప్పవచ్చు. ఉగ్రవాదులకి కనీస మానవత్వం కూడా వుండదని, స్నేహానికి సాచిన చేతులపై కూడా కనికరం లేకుండా ఉగ్ర వాద విషసర్పం కాటేస్తుందని మరొకసారి స్పష్టం చేసింది ఘటన. భారత్-పాక్ స్నేహపూర్వక చర్చలకు సిద్ధమవుతున్న దశలో ఉగ్రదాడులు జరగడం ఘోరం. ఈ నేపథ్యంలో, చర్చల కన్నా ముందు భద్రతే ప్రధానం. ఉగ్రవాదుల పట్ల ఎల్లవేళలా అప్రమత్తంగా వుండడమే..అందరికీ అసలైన రక్షాకవచం.

పంజాబ్‌లోని పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై ఉగ్రదాడి మనకే కాదు..ప్రపంచానికంతటికీ ఒక గుణపాఠమనే చెప్పవచ్చు. స్నేహానికి సాచిన చేతులపై కూడా కనీసం కనికరమన్నది లేకుండా ఉగ్రవాద విషసర్పం కాటేస్తుందని, ఉగ్రవాదానికి మారణకాండలే తప్ప మానవత్వం అన్నది ఏ కోశానా వుండదని అందరికీ మరొకసారి స్పష్టం చేసింది ఘటన. గొంతులు కోయడం, తుపాకీగుళ్ళతో గుండెల్ని చిల్లులు చేయడం, దొంగచాటుగా పొంచివుండి కన్పించినవారందరినీ కాల్చిచంపడం వంటి కిరాతకాలన్నీ వారికి మంచినీళ్ళ ప్రాయమే.

ప్రాంతమేదైనా, దేశమేదైనా సరే. ఉగ్రవాదులకు కావాల్సింది భీభత్సకాండలే.. శవాల బంతులాటలే. వారి అరాచక.. కిరాతక.. రాక్షసతత్వానికి అంతే వుండదు. ఉగ్రవాదంతో ప్రపంచాన్ని భయకంపితుల్ని చేయాలన్నదే వారి లక్ష్యం. మానవత్వానికి శత్రువుగా పుట్టి.. ప్రపంచ శాంతినీ కాంతినీ ధ్వంసం చేయాలన్నదే వారి ఏకైక ధ్యేయం. ఏ ఒక్క పఠాన్‌కోట్ మాత్రమే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలు ఇలాంటి దారుణాలనే ఎదుర్కొం టున్నాయి. ఇటీవలి కాలంలో ఈ ఉగ్రవాద దారుణ మారణకాండలకి అనేక దేశాలు తల్లడిల్లిపోతూనే వున్నాయి. అందుకే, ఉగ్ర వాదంపై సమిష్టి పోరుకు భారత్ ప్రపంచాన్నే సమాయత్తం చేస్తున్న తరు ణంలో.. ఇక్కడ పంజాబ్‌లో ఉగ్రవాదం మరోసారి పంజా విసరడం గమనార్హం. పాకిస్తాన్‌తో చర్చల ఊసే లేకుండా చేసేందుకు, తద్వారా ఉగ్రవాదాన్ని మరింతగా పెంచి పోషించుకునేందుకు పాక్ ప్రేరేపిత ఉగ్రసంస్థలు, ఉగ్రవాదులు అనునిత్యం కుట్రలు కుతంత్రాలూ చేస్తూనే వున్నారనేందుకు ఇది నిదర్శనం.

ఇటీవల ప్రధాని మోడీ ఆకస్మికంగా లాహోర్‌కు వెళ్ళి పాకిస్తాన్ ప్రధాని నవాజ్ షరీఫ్‌తో భేటీ అయివచ్చిన కొద్ది రోజులకే పాక్ ప్రేరేపిత ఉగ్రవాద కిరాతకులు పఠాన్‌కోట్‌లో ఉగ్రదాడికి పాల్పడడం ప్రపంచాన్నే ఉలిక్కిపడేలా చేసింది. ఉగ్రవాదులు భారీఎత్తున ఆయుధాలతో వచ్చి పఠాన్‌కోట్‌లో భీభత్సం సృష్టించారు. అయితే, అందుకు భారత వీర జవాన్లు వారికి ధీటైన జవాబే చెప్పారు. భారత్ సైనికుల ధాటికి ఎట్టకేలకు ఆ ఉగ్రవాద ముష్కరులంతా మట్టికరిచారు. పాకిస్తాన్‌కు 30 కిలోమీటర్ల దూరంలో వున్న పఠాన్‌కోట్ భారత్‌కు రక్షణ పరంగా ఎంతో కీలకమైన సైనిక స్థావరం. యుద్ధ విమానాలున్న ఈ సైనిక స్థావరాన్ని ధ్వంసం చేయాలన్న వ్యూహంతోనే కరడుగట్టిన ఉగ్రవాదులు ఈ దాడులకు తెగబడివుంటారని భావిస్తున్నారు. పఠాన్‌కోట వైమానిక స్థావరానికి సైనిక దుస్తులతో ప్రవేశించిన ఉగ్రవాదులు మాటువేసి సైనికులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో, అప్రమత్తమైన సైనికదళాలు ఆ ఆరుగురు ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాడి వారందరినీ మట్టుబెట్టారు. మన సైనికదళం, వైమానిక దళం, ఎన్ఎస్‌జీ (నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్) సమన్వయంగా, కలిసికట్టుగా ఉగ్రదాడిని ఎదుర్కొన్నాయి. బ్లాక్‌క్యాట్ కమాండోలు, అధునాతన ఆయుధాలతో రంగంలోకి దూకి ఆ ఉగ్రవాదులందరినీ హతమార్చడం భారత సైనికశక్తికి ప్రబల నిదర్శనం. అయితే, ఈ ఘటనలో ఎన్ఎస్‌జి బాంబ్‌స్క్వాడ్ కమాండింగ్ ఆపరేషన్ లెఫ్టినెంట్ కర్నల్ ఇ.కె నిరంజన్ మృతి చెందడంతో పాటు, మన భద్రతాసిబ్బంది పలువురు మరణించడం ఎంతో దురదృష్టకరం.. ఇది తీరని విషాదం. అసమాన ధైర్యసాహసాలతో ఉగ్రవాదులను ఎదుర్కొన్న ఆ అమర సైనిక వీరయోధు లందరికీ భారత ప్రజ జోహార్లర్పిస్తోంది.

అయితే, ఇప్పుడే కాదు, గతంలో కూడా ఉగ్రవాదులు ఇలాంటి దాడులకు పాల్పడ్డారు. పాక్‌తో చర్చలన్నప్పుడల్లా పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల కంటికి కునుకురాదు. ఇక్కడే కాదు.. ఎక్కడ శాంతియత్నం జరుగుతున్నా వెంటనే దానిని భగ్నం చేయాలన్నదే వారి లక్ష్యం. అందులోనూ ఇప్పుడు భారత్-పాక్ ప్రధానులు దౌత్యపరమైన సంబంధాలను మెరుగుపరచుకునేందుకు సమాయత్తమవుతుండడం పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులకు మరింత కంటగింపుగా తయారైంది. ఆ అక్కసుతోనే ముష్కరులు ఇలాంటి దురాగతాలకు పాల్పడివుంటారని భావిస్తున్నారు. ఈ ఉగ్రదాడులను ప్రపంచవ్యాప్తంగా అందరూ ఖండి స్తున్నారు. పాక్ మీడియా కూడా తీవ్రంగా ఖండిం చింది. చర్చల ప్రక్రియకు గండికొట్టేందుకే ఉగ్ర వాదులు ఇలా బరితెగింపుకు పాల్పడ్డారంటూ పాక్ లోని డాన్ పత్రిక పేర్కొంది. అంతే కాదు, పఠాన్ కోట్‌పై దాడికి పాల్పడిన ఉగ్రవాదులపై తక్షణం కఠిన చర్యలు తీసుకుంటామంటూ పాక్ ప్రధాని నవాజ్‌షరీఫ్ భారత ప్రధాని మోడీకి టెలిఫోన్ ద్వారా తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు పూర్తిగా సహకరిస్తామని కూడా ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, భారత్-పాక్ చర్చలు జరగకూడదనే లక్ష్యంతో, మరోవైపు భారత రక్షణ వ్యవస్థను దెబ్బ తీయాలనే ధ్యేయంతో ఉగ్రవాదులు ఇలాంటి రాక్షసకృత్యాలకు పాల్పడుతున్నారు. 1965లోనూ, 1971 లోనూ ఇదే వైమానికస్థావరంలో ఉగ్రవాదులు భీభత్సాలు సృష్టించిన విషయం తెలిసిందే. మళ్ళీ ఇది మూడవ విధ్వంస కాండ. ఇలాంటి వాటిని ధీటుగానే ఎదుర్కోవాలి. అసలు, భారత రక్షణ వ్యవస్థకు సంబంధించి ఇంతటి కీలకమైన వైమానిక స్థావరంలోకి ఉగ్రవాదులు ఎలా ప్రవేశించగలిగారు?.. నిఘా వ్యవస్థ అసలేమైనట్లు?.. భద్రతాపరంగా వున్న లోపాలే చివరికి మనకు శాపాలుగా మారుతున్నాయా?.. ఏదేమైనా పఠాన్‌కోట్ ఘటన మనకొక గుణపాఠమే అనుకోవాలి. ఇకనైనా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి. భద్రతా యంత్రాంగం మరింత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి. చర్చల కన్నా ముందు భద్రతే ప్రధానం. ఉగ్రదాడుల పట్ల, ఉగ్రవాదుల పట్ల..ఉగ్రవాదం పట్ల అనుక్షణం జాగరూకతతో వుంటూ ఎప్పటికప్పుడు మనల్ని మనం రక్షించుకోవడమే అన్నింటికన్నా ముఖ్యం. అందుకే, ఎల్లవేళలా అప్రమత్తతే మనకు.. మన జాతికీ.. మన దేశానికీ శ్రీరామరక్ష.

## ఉత్తమ వలంటీర్‌గా డికెడబ్ల్యు విద్యార్థిని

నెల్లూరు డికెడబ్ల్యు కళాశాలకు చెందిన హరిప్రియ అనే విద్యార్థిని ఎన్ఎస్ఎస్ జాతీయస్థాయి ఉత్తమ వలంటీర్‌గా ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ శైలజ తెలియజేశారు. కర్నాటకలో జరిగిన ఎన్ఎస్ఎస్ శిబిరంలో ఆమె ఉత్తమ వలంటీర్‌గా ఎంపికైందంటూ హరిప్రియను, ఆమెతో పాటు పాల్గొన్న సభ్యులను ఈ నెల 2న కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ అభినందించారు. విఎస్‌యు, ఎస్వీ యూనివర్శిటీల బృందానికి డికెడబ్ల్యు కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఉమామహేశ్వరి ప్రాతినిధ్యం వహించారన్నారు. ఈ కార్యక్రమంలో విఎస్‌యు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రమేష్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా ధనుర్మాస పూజలు

ధనుర్మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు మూలాపేటలో వున్న శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస పూజలు కన్నుల పండువగా జరిగాయి. ఉదయాన్నే ఆలయ అర్చకులు స్వామివారికి గోపూజ చేసి, అనంతరం గోదాదేవి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకలో పాల్గొన్నారు. సాయంత్రం మహాలక్ష్మి అమ్మవారికి విశేష అలంకారం నిర్వహించి, ప్రాకారోత్సవం, ఆ తర్వాత ఊంజల్‌సేవ నిర్వహించారు. తిరుప్పావై పారాయణం చేసి, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ నిర్వాహకుల పర్యవేక్షణలో ఆలయ అర్చకులు ఈ వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు.

## కెఎన్ఆర్ విద్యార్థుల ప్రతిభ

నెల్లూరులో కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా అటు చదువులోనూ ఇటు క్రీడల్లోనూ రాణిస్తున్న విద్యాలయం బి.వి.నగర్‌లోని కెఎన్ఆర్ఎం హైస్కూల్. ఈ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు సి. హెచ్.కల్యాణి(క్రికెట్), సాయికుమార్ (ఖోఖో), సంధ్యారాణి(ఖోఖో) జాతీయస్థాయి పోటీలకు ఎంపిక య్యారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జరుగుతున్న క్రికెట్ పోటీలలో కల్యాణి, కర్నాటకలోని తుముకూరులో జరుగుతున్న ఖోఖో పోటీలలో సాయి కుమార్, సంధ్యారాణిలు పాల్గొననున్నారు.




## దుర్వినియోగమవుతున్న చట్టం

ఇటీవల కాలంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం బాగా దుర్వినియోగమవుతుంది. నిజమైన బాధితులకు ఈ చట్టం ఉపయోగపడడం లేదు. కుల సంఘాల ముసుగులో దౌర్జన్యాలు జరిపేవారికి ఈ చట్టం ఎక్కువుగా ఉపయోగపడుతోంది. ఒక్కోసారి అగ్రకులాల వారు బాధితులై వుండి కూడా ఈ చట్టం మూలంగా పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. నిజమైన బాధితులకు రక్షణ కల్పించేలా ఈ చట్టంలో సవరణలు తేవాలి. దొంగ కేసులు బనాయించే వారిపై చర్యలు తీసుకునేలా మార్పు చేయాలి.

**దిండి రవికాంత్, కడప.**

## ప్రైవేట్ పర్మిట్‌లు వద్దు

ఇప్పటికే చదువు కార్పొరేట్ మార్కెట్‌లో వుంది. సామాన్యులు చదువును కొనే పరిస్థితులు లేవు. ఇప్పుడు డీమ్డ్ యూనివర్శిటీలు వస్తే పేద, మధ్యతరగతి ప్రజలకు చదువులు మరింత దూరమవుతాయి. కాబట్టి డీమ్డ్ యూనివర్శిటీల ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలి.

**శారద.సి, నెల్లూరు.**

## టు ఇన్ ఒన్

మోడీ పాక్ పర్యటన సరికొత్త దౌత్య సంప్రదాయం కాదు. ఉభయతారక వింత సంప్రదాయం! ఈ పర్యటన ఇద్దరు ప్రధానులు ప్రజల దృష్టిని మరల్చేందుకు ఉపయోగపడుతుందేమో! బీజేపీ పరాజయాల పరంపర నుండి ప్రజల దృష్టి మరల్చేందుకు, మోడీ ముస్లిం వ్యతిరేకి అన్న అపప్రదను చెరిపి వేసేందుకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని మోడీ, సంఘ్‌పరివార్ల ఉద్దేశ్యం. అందుకే 'చేసేది చెప్పబోకురా నా సామిరంగ చేసింది తెలియనీకురా' అంటూ మోడీ సెన్‌సేషనల్ వార్తను వదిలాడేమో!

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## తెలంగాణ రాజు కేసీఆర్

సోనియాగాంధీ పుణ్యంతో తెలంగాణ రాష్ట్రాన్ని పొంది, ఆమెనే వెనుకకు నెట్టేసి కేసీఆర్ సీఎం అయ్యాడు. కరణీకుల వంశం కాబట్టి పాత జమీందారీ పద్ధతిలో ఏకచత్రాధిపత్యం సాగిస్తూ, రాజుగా ఫీలవుతూ యజ్ఞయాగాదులు నిర్వహిస్తున్నారు. స్వాములు, పీఠాధిపతులను మచ్చిక చేసుకుంటూ తన కొలువును రాజప్రసాదంగా మలిచాడు. కాలం ఎప్పుడూ ఒకే రీతిలో ఉండదు. కేసీఆర్ కళ్లు నేలకు దించి నడవాలి.

**– వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## రాజధాని తాకట్టు

అమరావతి రాజధానిని సింగపూర్ కంపెనీలకు తాకట్టుపెట్టడానికి చంద్రబాబు సిద్ధంగా వున్నారు. ఆయన సింగపూర్ వ్యామోహం రాష్ట్రానికి చేటుగా మారుతోంది. రాజధాని భూముల లీజులను 33ఏళ్ల నుండి 99ఏళ్లకు పెంచడం దారుణం. అంటే రాజధాని మొత్తం ప్రైవేట్ కంపెనీల చేతుల్లో వున్నట్లే! చంద్రబాబు విధానాలు వినాశకరంగా ఉంటున్నాయి.

**పైడిమాల మాల్యాద్రి, నెల్లూరు.**

## పాడుబుద్ధి పోనిచ్చుకోదు

గతంలో వాజ్‌పేయి పాకిస్థాన్ పర్యటనకు వెళ్లొచ్చాక ఆ దేశం కార్గిల్ చొరబాట్లకు పాల్పడింది. ఇప్పుడు నరేంద్ర మోడీ లాహోర్‌లో దిగొచ్చాక ఆ దేశ ఉగ్రవాదులు పఠాన్‌కోట్ దురాగతానికి పాల్పడ్డారు. మనం స్నేహం ఆశించేకొద్ది వాళ్లు శత్రుత్వాన్ని పెంచుకుంటున్నారు. పాకిస్థాన్‌తో సమస్య శాంతి మార్గంలో తేలేలా కనిపించడం లేదు. అంతర్జాతీయంగా పాక్‌పై వత్తిడి తెచ్చి ఉగ్రవాద శిబిరాలను నిర్మూలించాలి.

**తీపనూరు సుదర్శన్, చీరాల.**

## జడ్పీ స్థాయీసంఘం సమావేశాలు

ఈ నెల 12, 18, 19 తేదీల్లో జడ్పీ స్థాయీ సంఘం సమావేశాలు నిర్వహిస్తామని జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేది ఉదయం పదిన్నర గంటలకు గ్రామీణాభివృద్ధి విషయాలపై సమావేశం, మధ్యాహ్నం 3 గంటలకు వ్యవసాయ పరిస్థితులపై సమావేశం జరుగుతుందన్నారు. 18వ తేదీ ఉదయం పదిన్నర గంటలకు విద్య, వైద్య విషయాలపై సమావేశం జరుగుతుందని, మధ్యాహ్నం 3 గంటలకు స్త్రీ శిశు సంక్షేమంపై సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. 19వ తేది ఉదయం పదిన్నరకు సాంఘిక సంక్షేమ శాఖ విషయాలపై, మధ్యాహ్నం 3 గంటలకు ప్రణాళిక, ఆర్థిక విషయాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన విషయాలపై సమావేశం జరుగుతందన్నారు. జడ్పీటిసి సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆయా రోజుల్లో ఈ సమావేశాలకు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆత్మకూరు విషయంలో.. అదును కోసం చూస్తున్న ఆనం



***ఆనం సోదరులు తెలుగుదేశం పార్టీలో చేరడాన్ని వాళ్ల అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. నిన్నటివరకు చంద్రబాబును నానా తిట్లు తిట్టి ఇప్పుడు ఆయన పక్కకే పోవడం మింగుడుపడని విషయమే. అయితే ఆనం సోదరులు చంద్రబాబు మీద అభిమానంతో తెలుగు దేశంలోకి మారలేదు. విధిలేని పరిస్థితుల్లోనే వాళ్లు అక్కడకు పోవాల్సివచ్చింది. తమ సీనియార్టీకి జగన్ దగ్గర కంటే చంద్రబాబు దగ్గరే గౌరవం లభిస్తుందని వాళ్లు ఆ వైపు అడుగువేశారు.***

ఆనం సోదరులు రాగానే జిల్లా తెలుగుదేశంలో అలజడి మొదలవుతుందని, ఆధిపత్య రాజకీయాలు, గ్రూపులు రేగుతాయని చాలావరకు భావించారు. అయితే అలాంటి రాజకీయాలకు ఆనం బ్రదర్స్ దూరంగా ఉంటున్నారు. ఎందుకంటే ఇప్పటికప్పుడు పార్టీలోకి వచ్చి పెత్తనం చెలాయిస్తే అది తమకే రివర్స్ అవుతుందని వాళ్లకు తెలుసు. తమకు పట్టున్న నెల్లూరు రూరల్, నగరం, ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలకు సంబంధించి వాళ్లింత వరకు వేలు పెట్టలేదు. ముఖ్యంగా ఆనం రామనారాయణరెడ్డికి ఆత్మకూరు బాధ్యతలు మాత్రమే అప్పగించారని, ఇంకే నియోజకవర్గంలోనూ కలుగజేసుకోవద్దని చంద్రబాబు మొదట్లోనే చెప్పాడని సమాచారం. అయితే ఇంతవరకు ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు రాజకీయాలలో వేలు పెట్టలేదు. ఆయన వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆత్మకూరు ఇన్‌ఛార్జ్‌గా గూటూరు కన్నబాబు ఉంటున్నాడు. 2014ఎన్నికల్లో ఈయన పోటీ చేసి ఓడిపోయాడు. అప్పుడు పెట్టిన ఖర్చుకు ఇన్‌ఛార్జ్‌గా రికవరీ పనిలో వున్నాడు. ఇప్పుడు ఆనం దిగితే కన్నబాబు కడుపు కొట్టినట్లవుతుంది. ఆనం చేరినప్పుడే కన్నబాబు ఆయనకు వ్యతిరేకంగా తన అనుచరుల చేత సమావేశాలు పెట్టించాడు. కన్నబాబును వ్యతిరేకం చేసుకోవడం కూడా రామనారాయణరెడ్డికి ఇష్టం లేదు. అందుకే కన్నబాబు పనులకు వ్యతిరేకంగా పోవడం లేదు. అదీగాక నియోజకవర్గంలో ఆనంకు పాత కేడర్ లేదు. 2014ఎన్నికలప్పుడే ఎక్కువ మంది అనుచరులు వైకాపాలోకి వెళ్లిపోగా, కొద్దోగొప్పో కన్నబాబు వైపు వెళ్ళారు. ఇప్పుడు ఉన్న ఫళంగా వీళ్లంతా ఆనం వద్దకు రాలేరు. దానికి కొంత టైం పడుతుంది. పాత కేడర్ అంతా వచ్చి తన వెనుక నిలిస్తేగాని రామనారాయణరెడ్డి ఉత్సాహంగా ముందుకుపోలేడు. రామనారాయణరెడ్డి ఇప్పటి నుండి చొరవ తీసుకుని అందరితో మాట్లాడితే ఆయన వద్దకు రావడానికి చాలామంది అనుచరులు సిద్ధంగా వున్నారు. ఇప్పటి నుండి ప్రయత్నిస్తే మరో ఏడాదిలో ఆనం పాత బలాన్ని తెచ్చుకోవచ్చు. ఆత్మకూరు రాజకీయాల్లో ఆనం ప్రత్యక్షంగా కాలుపెట్టేది అన్నీ అనుకూలించాకే జరగొచ్చు.

# మేకిన్ ఇండియాకు దివిటీ... శ్రీసిటీ

## ట్రాఫిక్ సమస్యకు మెట్రో మెడిసిన్ - వెంకయ్య



దేశంలోని పలు నగరాలలో చోటు చేసుకుంటున్న ట్రాఫిక్, కాలుష్యం వంటి సమస్యలకు మెట్రో రైల్ ప్రాజెక్టే చక్కని పరిష్కారమని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి యం.వెంకయ్యానాయుడు అభిప్రాయపడ్డారు. ఈ నెల 2వ తేదీన తడ సమీపంలోగల ప్రతిష్టాత్మక పారిశ్రామికవాడ శ్రీసిటీలోని ఆల్‌స్టామ్ పరిశ్రమ నుండి కొచ్చి మెట్రో రైల్ ప్రాజెక్ట్‌కు రైలు బోగీలను సరఫరా చేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టును తగ్గించి దాని స్థానంలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను పెంచాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగానే పలు నగరాలలో మెట్రో ప్రాజెక్ట్‌లు చేపడుతున్నట్లు చెప్పారు. మెట్రో ద్వారా ప్రశాంతతతో కూడిన ప్రయాణం చేయవచ్చని, త్వరలోనే మెట్రో ఛార్జీలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన కొచ్చి మెట్రో అధికారులను, శ్రీసిటి ఎం.డి రవీంద్ర సన్నారెడ్డిని, ఆల్‌స్టామ్ యాజమాన్యాన్ని అభినందించారు. వందకు పైగా విదేశీ పరిశ్రమలతో అభివృద్ధి చెందుతున్న శ్రీసిటీ, కేంద్రం ప్రారంభించిన మేకిన్ ఇండియా ఉద్యమానికి ప్రతిరూపంగా నిలుస్తుందని ప్రశంసించారు.

శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ మేకిన్ ఇండియాలో భాగంగా కొచ్చిన్ మెట్రో ప్రాజెక్ట్‌కు 'మేడిన్ శ్రీసిటి' రైలు పెట్టెలను ఆల్‌స్టామ్ అందించడం మాకెంతో గర్వకారణమన్నారు.

ఈ కార్యక్రమంలో కేరళ విద్యుత్‌శాఖ మంత్రి అర్వదన్ మొహమ్మద్, కొచ్చిన్ ఎంపి కె.వి.థామస్, తిరుపతి ఎంపి వరప్రసాద్, కెపిఎంఎల్ ఎం.డి ఎలియాస్ జార్జి, కేరళ ఎమ్మెల్యేలు అన్వర్ సాదత్, హిబి హెడెన్, ఢిల్లీ మెట్రో మాజీ ఎం.డి శ్రీధరన్, ఆల్‌స్టామ్ డిప్యూటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జీన్ ఫ్రాంకోయిస్ బ్యుడాయిన్, ఆల్‌స్టామ్ ఎం.డి భారత్ సల్హోత్రా తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



స్వర్గీయ సోమిరెడ్డి హైమావతమ్మ గారు
W/o. కీ॥శే॥ సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
జననం: 1938 మరణం: 15-01-2014

మాతృదేవోభవ

ఆప్యాయతానురాగాలు పంచిన అమృతమూర్తి
మా ఇంటి ఆరాధ్యదైవం, మా తల్లిగారైన
శ్రీమతి సోమిరెడ్డి హైమావతమ్మ గారు
మమ్ము వీడి దైవసన్నిధికి చేరి రెండేళ్ళు అవుతున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

కన్నీటి నివాళులతో...

కుమారుడు - కోడలు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతి

కుమార్తెలు - అల్లుళ్ళు
కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి
కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

మనుమలు - మనుమరాండ్రు
సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి - శ్రుతి
డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి - లక్ష్మీఐషిత
నిమ్మ కౌశిక్‌రెడ్డి - డా॥ సింధు
సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి - నీలిమ
యల్లా సనత్‌రెడ్డి - షాలిని
డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి - డా॥ మాలిని
కేతిరెడ్డి శశధర్‌రెడ్డి - కీర్తి
కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి - స్నిగ్ధ

మునిమనుమలు
యల్లా శర్విన్
కేతిరెడ్డి శ్రీమన్
నిమ్మ ధీర్
కేతిరెడ్డి శ్రీవంత్

మునిమనుమరాండ్రు
యల్లా సంజన
సోమిరెడ్డి శివాని
కేతిరెడ్డి శ్రితిక
కట్టంరెడ్డి శ్రీశాన్వి
సన్నారెడ్డి నిరుక్తలేఖ
సన్నారెడ్డి రాయల్ భార్గవ్

## నెల్లూరు కబుర్లు

# వెంకయ్యకు శుభాకాంక్షల వెల్లువ



ఈ నెల 2వ తేదీన నెల్లూరు వచ్చిన కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడును తెలుగుదేశం, బీజేపీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువలో ముంచెత్తారు. అలాగే నగరానికి చెందిన పలువురు ప్రముఖులు కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, బీద రవిచంద్ర, మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కన్నబాబు, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, పి.సురేంద్రరెడ్డి, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, కందుకూరు సత్యనారాయణ తదితరులు నెల్లూరు రిత్విక్ ఎన్‌క్లేవ్‌లోని వెంకయ్య ఇంటికెళ్లి శుభాకాంక్షలు చెప్పారు.

# నెల్లూరు సభకు ఆనం డుమ్మా

నెల్లూరులోని విఆర్‌సి మైదానంలో జరిగిన 'స్వదేశీదర్శన్' సభకు ఆనం సోదరులు రాకపోవడం చర్చనీయాంశమైంది. ఆనం బ్రదర్స్ ఇటీవలే తెలుగుదేశంలో చేరారు. వాళ్లు చేరాక చంద్రబాబు నెల్లూరు రావడం ఇదే! కాబట్టి ఖచ్చితంగా ఆనం బ్రదర్స్ వస్తారని అందరూ వూహించారు. అయితే వివేకా గాని, రామనారాయణరెడ్డి గాని విఆర్‌సి వైపు చూడలేదు. అయితే పెద్దపాడులో జరిగిన జన్మభూమి సభకు ఆనం రామనారాయణరెడ్డి హాజరయ్యారు. అంతేకాదు, చంద్రబాబు కావలి చేరాక, బస్సులో ఆయనతోపాటే వుండి ఓ అరగంట పాటు మంతనాలు జరిపారు. రామనారాయణరెడ్డి బస్సులో వున్నప్పుడు పార్టీ సీనియర్లంతా బస్సు బయటే నిలబడి వున్నారు.

# విశ్వసాయి విద్యార్థికి సిఎం అభినందన



ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ప్రవేశ పరీక్షలో 35వ ర్యాంక్, బీసీ కేటగిరిలో ఏపిలో ప్రథమ ర్యాంక్‌ను సాధించిన విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థి కడగుంట యశ్వంత్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు. విఆర్ కళాశాల మైదానంలో ఆదివారం యశ్వంత్‌కు మెమొంటోను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మెన్ సత్యనారాయణ, వైస్‌ప్రిన్సిపల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ యశ్వంత్ వెయ్యి మార్కులకు గాను 986 మార్కులు సాధించాడన్నారు.

# మండువ సేవకు సత్కారం



ప్రకాశం జిల్లా ఒంగోలు ఎంహెచ్‌ఆర్ ఫంక్షన్ హాల్లో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వాకర్స్ సమావేశం ఇటీవల జరిగింది. ఈ సభకు ఎస్.చిన్నసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వాకింగ్ విశిష్టతను గురించి హోస్ట్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జె.ప్రభాకర్‌రెడ్డి, కాశీవిశ్వనాథం మాట్లాడారు. అనంతరం గుంటూరు, ప్రకాశం, నెల్లూరు వాకర్సు చూపిన ప్రతిభను బట్టి వాకర్ గవర్నర్ సుబ్రహ్మణ్యం బహుమతి ప్రదానం చేశారు. నెల్లూరు జడ్పీ వాకర్స్ కార్యదర్శి మండువ శ్రీనివాసరావుకు ఉత్తమ సర్వీస్ అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.వి. సుబ్బారెడ్డి, మైథిలి మనోహర్‌రెడ్డి, శేషగిరిరావు, సుబ్రహ్మణ్యం, శివరామయ్యలను అవార్డులతో సత్కరించారు. జడ్పీ వాకర్సు సంఘం అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు సుధాకర్‌రెడ్డి, యం.వి.కృష్ణయ్య, అల్లూరు చినరాజు పాల్గొన్నారు.

# మంత్రికే దడ పుట్టించారు

- ఫ్లెక్సీలలో తమ ఫోటోలు లేకపోవడంపై ఫైర్ అయిన కోటంరెడ్డి, కిలారి




రాష్ట్ర ప్రభుత్వంలో చంద్రబాబు తర్వాత అంతటి ప్రాధాన్యత వున్నది మన మంత్రి పి.నారాయణకే! నారాయణ ఏం చెప్పినా అది చంద్రబాబు చెప్పినట్లే అన్న ప్రచారం ఉంది. అలాంటి మంత్రికే దడ పుట్టించారు మన తెలుగుదేశం నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడులు. బాబ్బాబు... కొంచెం శాంతించండని మంత్రి తమను బ్రతిమలాడుకునే పరిస్థితిని కల్పించారు.

వివరాలలోకి వెళితే... 3వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబు నెల్లూరొస్తున్న సందర్భంలో నగరం నిండా తెలుగుదేశం నాయకులు ఫ్లెక్సీలు అలికిపెట్టారు. మంత్రి పి.నారాయణ ముఖ్యఅనుచరుడైన వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి కూడా నగరంలో కొన్ని స్వాగత ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. అయితే పట్టాభి పెట్టించిన ఫ్లెక్సీలలో జిల్లాలోని ముఖ్యనాయకులందరి ఫోటోలు వేసి కోటంరెడ్డి శీనయ్య, కిలారి వెంకట స్వామినాయుడుల ఫోటోలు వేయలేదు. దీంతో ఈ ఇద్దరు నాయకులు రగిలి పోయారు. 3వ తేదీ చంద్రబాబు పర్యటన సందర్భంలో మంత్రి నారాయణతో తమకు జరిగిన ఈ ఫ్లెక్సీ అన్యాయాన్ని ప్రశ్నించారు. మాకు ఇంత అన్యాయం జరుగుతుంటే మీరేం చేస్తున్నారని మంత్రిని నిలదీసారు. మాకు జరిగిన అన్యాయం గురించి సీఎంకు చెప్పాలి. మీరే చొరవ తీసుకుని సీఎం అపాయింట్‌మెంట్ ఇప్పించండని మంత్రినే కోరారు. ఇక్కడ మంత్రి కొంచెం ఇదై పోయాడు. ఎందుకొచ్చిన తలనొప్పి అనుకున్నాడో ఏమో వారిని బుజ్జగించి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన తన అనుచరుడు పట్టాభిని పిలిచి ఇంకోసారి వీళ్లను మరచి పోవద్దని చెప్పాడని తెలిసింది. నోరుండే వాళ్లకే మంత్రి మాట వింటాడనేందుకు ఇదో ఉదాహరణ.

# బిపిఎస్ గడువు పెంచారు

భవనాల క్రమబద్ధీకరణకు సంబంధించిన బిపిఎస్ గడువును ఈ నెల 31వ తేదీ వరకు పెంచారు. ఈమేరకు ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటిదాకా ఈ స్కీం క్రింద నాలుగువేల అప్లికేషన్‌లు వచ్చాయి. అరకొర మిగిలిన వాళ్లు ఈ నెలలో దరఖాస్తు చేసుకోవచ్చు.

# ఎస్‌బిలోనే కోటారెడ్డి

నెల్లూరుజిల్లా స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీగా కోటారెడ్డి బదిలీ అయ్యారు. ఈమేరకు రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుండి 2వ తేదీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నెల్లూరు డీసీఆర్‌బీ డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆయన స్పెషల్ బ్రాంచి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు అక్కడే పర్మినెంట్ చేశారు.

# వియస్‌యులో బదిలీలు

వివాదాలకు కేంద్ర బిందువుగా వున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో తాజా బదిలీలు వివాదమయ్యాయి. యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వున్న మురుగయ్యను ఎగ్జామినేషన్ డీన్‌గా బదిలీ చేసి డెవలప్‌మెంట్ డీన్‌గా వున్న వెంకట్రావును ప్రిన్సిపాల్‌గా చేశారు. కావలిలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న చంద్రయ్యను డెవలప్‌మెంట్ డీన్‌గా బదిలీ చేశారు. అయితే, బదిలీ అయిన ఈ ముగ్గురు కూడా రిజిస్ట్రార్ పోస్ట్ వేటలో వుండడం విశేషం.

# సిఎంఆర్ లక్కీడ్రా విజేత స్రవంతి



నెల్లూరు కనకమహల్ సెంటర్‌లోని సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని సంబరాలు నిర్వహిస్తున్న విషయం విదితమే! షోరూంలో కొనుగోలు చేసిన వినియోగదారులకు ప్రతి వారం డ్రాతో పాటు రోజువారీ డ్రా కూడా నిర్వహిస్తున్నారు. ఈ వారం వీక్లీ డ్రాకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అతిథిగా పాల్గొని డ్రా తీశారు. నెల్లూరు హరనాథపురానికి చెందిన స్రవంతి(కూపన్ నెం.106233) డ్రాలో విజేతగా నిలిచి మోటార్‌బైక్‌ను గెలుపొందారు. ఈ సందర్భంగా సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ వినియోగదారుల కోసం అత్యాధునిక మోడల్స్, నాణ్యతతో కూడిన ఆభరణాలను తక్కువ ధరలకే అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజీయాడ్స్ అధినేత పెంచలయ్య, బీజేపీ నాయకులు గంగపట్నం అశోక్‌లు పాల్గొన్నారు.

# పుస్తకపఠనంతో విజ్ఞానపు వెలుగులు



పుస్తకపఠనంతో జ్ఞానం పెరుగుతుందని, తద్వారా విజ్ఞానపు కాంతులు ఎల్లెడలా వెల్లివిరుస్తాయని, ముఖ్యంగా విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని వెలికితీసేందుకు పుస్తకపఠనం ఎంతో అవసరమని విఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సివిఎస్ భాస్కర్ అన్నారు. 40వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం నుంచి నెల్లూరు విఆర్ కళాశాలలో ఎపి ఎస్ఆర్ గ్రంథాలయంవారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకపఠనంతో మరింత జ్ఞానాన్ని సముపార్జించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.బాబు, డాక్టర్ టి. రవీంద్రరెడ్డి, డాక్టర్ ఎన్.ప్రభాకర్ పాల్గొన్నారు.

# గడ్డలు తొలగించి గుండెను ఆడించారు

నెల్లూరులోని కిమ్స్(బొల్లినేని) ఆసుపత్రి వైద్యులు గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సలో ఓ విజయం సాధించారు. చిట్టమూరు మండలం మల్లాంకు చెందిన మల్లుపు దశరథయ్య(55) తీవ్రమైన గుండె నొప్పితో కిమ్స్ ఆసుపత్రికి వచ్చాడు. ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.ఎస్.రాజు ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించి గుండె రెండు గోడల మధ్య కండర నిర్మితమైన గోడలో గుండెపోటు వల్ల ఏర్పడిన రంధ్రాన్ని, గుండె రక్తనాళంలో వున్న గడ్డలను గుర్తించారు. థ్రాంబోలైజేషన్ ద్వారా గడ్డలను కరిగించారు. హార్ట్‌సర్జన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గత నెల 29న ఆక్వైర్‌విఎస్టీ సర్జరీ బీసి కార్డియో పల్మనరీ బైపాస్ సహకారంతో రంధ్రాన్ని మూసివేశారు. ఇప్పుడు రోగి పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా వున్నాడని మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి. గిరినాయుడు తెలిపారు.

# జిల్లాకు బాబొచ్చాడు.. మాటలతో డాబు చూపాడు

## • ప్రయోజనాలు రవ్వంత... ప్రశంసలు కొండంత!




నెల్లూరు సభలో 'స్వచ్ఛ నెల్లూరు యాప్'ను ఆవిష్కరిస్తున్న అగ్రనేతలు

"జన్మభూమి – మా ఊరు" కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 3న నెల్లూరుజిల్లాలో పర్యటించాడు. మొదట నెల్లూరు, వీఆర్ హైస్కూల్ మైదానంలో జరిగిన సభలో కేంద్ర మంత్రులు యం.వెంకయ్యనాయుడు, మహేష్‌శర్మ, ధావర్‌చంద్ గెహ్లాట్‌లతో కలిసి పాల్గొన్నాడు. ఇది పర్యాటక రంగాభివృద్ధికి సంబంధించిన సభ కావడంతో సీఎం ఎక్కువగా జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధిని గురించి మాట్లాడాడు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌ను తలపించేలా నెల్లూరు చెరువును అభివృద్ధి చేస్తామని, సింగపూర్ తలదన్నేలా సింహపురి సిటీని తీర్చిదిద్దుతామని చెప్పాడు. అభివృద్ధి పరంగా నెల్లూరును ఫాస్ట్‌ట్రాక్‌లో పెడుతున్నట్లు చెప్పాడు. జిల్లాలో నేలపట్టు, పులికాట్, సోమశిల, కండలేరు, ఇరకం, వేనాడు, పెంచలకోన వంటి పర్యాటక

### 'జన్మభూమి- మా ఊరు' కాస్త... 'జన్మభూమి - బొల్లినేని ఊరు'గా మారింది.

కేంద్రాలు, మైపాడు, కొత్తకోడూరు, రామతీర్థం, ఇస్కపల్లి వంటి బీచ్‌లు వున్నాయని, వాటిని పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చాడు. నెల్లూరు, తిరుపతి, చెన్నైలను కలుపుతూ ఒక పారిశ్రామిక హబ్‌ను రూపొందిస్తామన్నాడు. పనిలో పనిగా ఆయన రాష్ట్రాభివృద్ధి కోసం ఢిల్లీలో అహర్నిశలు కష్టపడుతున్నారంటూ కేంద్రమంత్రి వెంకయ్యనాయుడును పొగడ్తల్లో ముంచెత్తాడు.

నెల్లూరులో సభ ముగిసాక సిఎం కలిగిరి మండలం పెద్దపాడు వెళ్లారు. "జన్మభూమి – మా ఊరు" కాస్తా "జన్మభూమి – బొల్లినేని ఊరు"గా మారింది. ఇది బొల్లినేని రామారావు స్వగ్రామం. గట్టిగా 300 గడపలుంటాయి. మొదట వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లిలో ఈ సభ పెట్టాలనుకున్నప్పటికీ చివరి క్షణంలో బొల్లినేని తన స్వగ్రామానికి మార్చాడు. ఈ గ్రామానికి చంద్రబాబు 500 ఇళ్లు మంజూరు చేశాడు. అలాగే గ్రామానికి సిమెంట్‌రోడ్లు కావాలంటే ఓకే అన్నారు. పెద్దిరెడ్డిపల్లికి పట్టాల్సిన అదృష్టం ఈ విధంగా పెద్దపాడుకు పట్టింది. ఈ సభలో చంద్రబాబు నదుల అనుసంధానాన్ని గురించి మాట్లాడారు. గోదావరి నీళ్లను కృష్ణకు, కృష్ణ నీళ్లను పెన్నకు మళ్లించిన ఘనత తమదేనని చెప్పుకున్నారు. అందరూ సహకరిస్తే 20ఏళ్లలో చేయాల్సిన అభివృద్ధిని 5ఏళ్లలో చేసి చూపిస్తానని చెప్పారు. జిల్లాలో చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామని, నెల్లూరు, సంగం బ్యారేజీలను పూర్తి చేస్తామని, కాలువలను పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇక్కడ సభ ముగిసాక చంద్రబాబు కావలికి చేరుకున్నారు. రాత్రి బస బస్సులోనే చేసారు. జిల్లా నాయకులతో, అధికారులతో ఆయన బస్సులోనే మాట్లాడారు. మంత్రులు పి.నారాయణ, శిద్దా రాఘవరావు, రావెల్ల కిషోర్‌బాబు, ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బి.రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి, వాకాటి నారాయణ రెడ్డి, బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు బొల్లినేని రామారావు, కురుగొండ్ల రామకృష్ణ, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ యం.జానకి, జేసీ ఇంతియాజ్ అహ్మద్, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దపాడులో గొర్రెపిల్లను ఆప్యాయంగా ఎత్తుకున్న చంద్రబాబు



## రాజధానికి రెనిల్ చేయూత

### అమరావతికి 20వేల డాలర్లు.. నెల్లూరుకు 15లక్షల రూపాయలు

నెల్లూరుజిల్లా వాసి, ఎన్నారై, కోమిట్ల, యాత్రాజీని అధినేత రెనిల్‌రెడ్డి అమరావతి రాజధాని నిర్మాణానికి 20వేల డాలర్లు, నెల్లూరు నగరాభివృద్ధికి రూ. 15లక్షలు విరాళం ప్రకటించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం వీఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడులకు చెక్కు రూపంలో ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రెనిల్‌రెడ్డిని ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి అభినందించారు.

## అతిథి సత్కారం అదిరిపోవాలి


### పక్షుల పండుగ ప్రతిష్టాత్మకంగా ఉండాలి - కలెక్టర్ జానకి



జిల్లాలో ఈ నెల 9,10 తేదీల్లో నిర్వహించనున్న పక్షుల పండుగకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి ఆమె తన క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఉన్నతాధి కారులతో సమావేశమయ్యారు. 9వ తేదీన పక్షుల పండుగ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రులు, ప్రముఖులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పక్షుల పండుగలో భాగంగా ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాల్లో నవ్వుల బజార్, మ్యాజిక్ షో, లేజర్ షో, మ్యూజికల్ నైట్ వగైరాలన్నీ అందరినీ అలరించేవిధంగా వుండాలన్నారు. పక్షుల స్థావరాలైన నేలపట్టు, భీములవారిపాలెం, పులికాట్, అటకానితిప్ప ప్రాంతాల్లో పర్యాటకులు పక్షులను సందర్శించేందుకు వీలుగా ఏర్పాట్లు సక్రమంగా చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసి ఇంతియాజ్, జేసి–2 రాజ్‌కుమార్, డిఆర్‌ఓ సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, డిఆర్‌డిఏ పి.డి చంద్రమౌళి, డ్వామా పి.డి రామచంద్రారెడ్డి, జడ్పీ సిఇఒ రామిరెడ్డి, సిపిఓ గురుమూర్తి పాల్గొన్నారు.

## లంచం అడిగితే... జైలు కూడే గతి


### – తోట నోట తూటా లాంటి మాట



రైతులను లంచాల కోసం పీడించారో.. కటకటాల ఊచలు లెక్కపెట్టుకోవాల్సిందేనంటూ అవినీతి అధికారులను ఏసిబి డిఎస్పీ తోట ప్రభాకర్‌రావు హెచ్చరించారు. ఈ నెల 2వ తేదీన ఆయన నెల్లూరులో విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యంగా రెవెన్యూ విభాగంలో లంచం ఇవ్వనిదే పనికావడం లేదని పెద్దసంఖ్యలో రైతుల నుంచి తమకు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు.

అధికారులు రైతులను ఇబ్బందిపెట్టడం ఇకనైనా మానుకుని రైతుల సమస్యలు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. తహశీల్దార్లు, ఆర్డీఓలు రైతుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. సమస్యల కోసం వచ్చిన రైతుల నుంచి లంచాలు ఆశిస్తూ రైతులను ఇబ్బందుల పాలుచేస్తున్న సిబ్బందిపై అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అవినీతిపరులైనా ఎవరైనా సరే తాము ఉపేక్షించేది లేదని, అవినీతి అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. అవినీతి అధికారులకు జైలు తప్పదన్నారు.

కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగితే, నేరుగా తమకు ఫిర్యాదు చేయాలని ఆయన ఈ సందర్భంగా రైతులకు, అన్నివర్గాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఒకవేళ నేరుగా ఫిర్యాదు చేయలేని వారు 9440446184 నంబరుకు గానీ, లేదా 9440446186 నంబరుకుగానీ ఫోన్ చేయాలని ఆయన సూచించారు.



# విద్యార్థుల చదువులే దేశానికి వెలుగులు

**- దీపా వెంకట్**

గూడూరు పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయం ప్రాంతంలో పివిఆర్ ట్రస్టు అధ్యక్షుడు పొనకా శివకుమార్‌రెడ్డి ఆధ్వర్యాన మున్సిపాలిటీ పరిధిలోని 1200మంది విద్యార్థినీవిద్యార్థులకు సమ దుస్తులు, బూట్లను సోమవారం స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మంచి పాఠ్యాంశాలతో ఉపాధ్యాయులు బోధన చేయడం ద్వారా సమాజంలో మంచితనం పెరిగేందుకు సాధ్య పడుతుందన్నారు. గతంలో మూడు కిలోమీటర్ల దూరం నడచి అష్టకష్టాలు పడి వీధిబడుల్లో చదివిన తన తండ్రి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు ప్రస్తుతం ఉన్నత స్థాయిలో వున్నారన్నారు. ఇదంతా పట్టుదల, లక్ష్య సాధనకు పడే కష్టాన్ని ఇష్టంగా మలుచుకోవడం ద్వారానే సాధ్య మైందన్నారు. మంచిపనికి అందరూ కలిస్తే వారి సేవా కార్యక్రమాలకు ట్రస్టు ద్వారా సహకరిస్తామని తెలిపారు. గూడూరు మున్సిపల్ ఛైర్మెన్ పొనకా దేవసేన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి, నియోజక వర్గ ఇన్‌ఛార్జి జ్యోత్స్నలత తదితరులు మాట్లా డుతూ కార్పొరేటుకు ధీటుగా మున్సిపల్ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్న పివిఆర్ ట్రస్టు ప్రతినిధులను అభినందించారు. అనంతరం భార్గవ్ హెల్త్ ప్లస్ లైఫ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహనకు సంబంధించి గోడపత్రికను ట్రస్టు ప్రతి నిధులు, దీపా వెంకట్ తదితరులు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో డిఎస్పీ బి.శ్రీని వాస్, నానాజీ, పులిమి శ్రీనివాసులు, మనపాటి రవీంద్ర, శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ మోదకొండ, కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దీపా వెంకట్

## గూడూరు డివిజన్ వార్తలు

# అధికారులతో పనులు చేయించుకోండి

**- ఎమ్మెల్యే పాశం సునీల్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్

గ్రామంలో వున్న సమ స్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం 'జన్మభూమి- మా ఊరు'ను నిర్వహిస్తోందని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని కందలి, కొమ్మ నేటూరు, పారిచర్ల, మంగళ పూర్ గ్రామాల్లో తహశీల్దార్ సి.వెంకటనారాయణమ్మ, ఎంపిడివో భవాని ఆధ్వర్యాన జన్మభూమి - మా ఊరును 2వ తేదీ నిర్వహించారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మండలంలోని మంగళపూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజల కోసం గ్రామాలకు అధికారులు వస్తున్న క్రమంలో సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పద్మ, మండల ఉపాధ్యక్షురాలు మట్టం శ్రావణి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో ఉత్సాహం పెరుగుతుంది




జూనియర్స్ విభాగంలో విజేతలుగా నిలిచిన నారాయణ కళాశాల జట్టు

గూడూరు క్రికెట్, రోటరీ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యాన ఆరు రోజులుగా నిర్వహించిన అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియం అంతర్‌కళాశాలల క్రికెట్ పోటీలు ఇటీవల ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా పోటీతత్వం పెరుగుతుందన్నారు. క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడంతో పాటు ఉత్సాహం నింపేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. తుది పోటీల్లో సీనియర్స్ విభాగంలో ఎస్వీ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల, జూనియర్స్ విభాగంలో నారాయణ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్, డిఎస్పీ బి.శ్రీనివాస్, పట్టణ సిఐ సుబ్బారావు గెలుపొందిన జట్టు క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.మునిగిరీష్, రోటరీ క్లబ్ అధ్యక్షులు అశోక్‌చక్రవర్తి, కె.ఆర్.రెడ్డి, జానకిరామిరెడ్డి, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై బురద జల్లడం మానుకోవాలి

**- రాష్ట్ర మంత్రి నారాయణ**

ప్రభుత్వంపై బురద చల్లడం, అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకోవాలని ప్రతిపక్షాలకు రాష్ట్రమంత్రి నారాయణ హితవు పలికారు. ఎన్టీఆర్ ఉచిత వైద్య పరీక్షల పథకాన్ని ఇటీవల నెల్లూరుజిల్లా గూడూరులో ప్రారంభించిన మంత్రి ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్న తీరును తప్పు పట్టారు. ముఖ్యంగా రాజధాని విషయంలో వారి వైఖరి సరిగా లేదని, అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. తాత్కాలిక సచివాలయానికి చదరపు అడుగుకు రూ.5వేలు ఖర్చు పెడుతున్నట్లు, ప్రజల సొమ్ము దోచేస్తున్నట్లు ప్రచారం చేయించారని, స్వయంగా తానే రూ.3వేలు చొప్పున 180కోట్లకు తాత్కాలిక సచివాలయానికి సంతకం చేసానన్నారు. ఎన్టీఆర్ ఉచిత వైద్య పరీక్షల పథకంతో పాటు 102 కాల్ సెంటర్, తల్లీ బిడ్డల ఎక్స్‌ప్రెస్, సిటీస్కాన్, రేడియాలజీ వంటి 5 రకాల సేవలు ప్రారంభించడం ద్వారా తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సంపూర్ణ ఆరోగ్యం అందించే ప్రయత్నం చేస్తుందన్నారు.

# సమస్యల పరిష్కారానికే... జన్మభూమి - మా ఊరు



అన్నప్రాసన చేస్తున్న సిడిపివో ఉమామహేశ్వరి, ప్రక్కన ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే సిఎం చంద్రబాబునాయుడు 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమాన్ని రూపొం దించారని గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. ఈ కార్యక్ర మాన్ని గూడూరు రెండో పట్టణంలోని 29, 30, 31వార్డుల్లో ఆదివారం పురపాలక కమిషనర్ మోదకొండ ఆధ్వర్యాన జివిఆర్ మున్సిపల్ పాఠశాలలో నిర్వ హించారు. ఈ సందర్భంగా దేవసేన మాట్లాడుతూ జన్మభూమి - మా ఊరు కార్యక్రమం ద్వారా రేషన్‌కార్డులు, పింఛన్లు, నిరుపేదలకు ఇళ్లు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో సమస్యలను గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, పలు వార్డుల కౌన్సిలర్లు, జన్మభూమి కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా గూడూరు రెండో పట్టణం దిగువ వీరారెడ్డిపల్లె, ఎగువ వీరారెడ్డిపల్లె, మాల్యావ్యానగర్ తదితర ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు ఐసిడిఎస్ అర్బన్ సిడిపివో ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని పౌష్టి కాహారం తీసుకొని సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# 'ఘంటసాల స్వరయుగం' పుస్తకావిష్కరణ




ఘంటసాల స్వరయుగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు జి.శ్రీనివాసకుమార్ తదితరులు

మధుర గాయకులు ఘంటసాల 94వ జయంతి సందర్భంగా 'పద్మశ్రీ ఘంటసాల చైతన్య వేదిక' ఆధ్వర్యంలో గూడూరు నరసింగరావు పేట శ్రీ గురుసాయి మందిరంలో సోమవారం 'ఘంటసాల స్వరయుగం' పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ఘంటసాల చైతన్య వేదిక రాష్ట్ర కో-ఆర్డినేటర్ అజ్జా గజేంద్ర, గాయకులు దుర్గం మధుసూదన్ పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు.

ఈ కార్యక్రమంలో మధురమైన గీతాలు ఆలపించి ఘంటసాలకు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగినందుకు ఆలయం ఆర్గనైజర్లు నిర్వాహకులు జి.శ్రీనివాసకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# రియాజ్ అహ్మద్‌కు పితృవియోగం

రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ తండ్రి వజీర్ అహ్మద్(80) ఈనెల 1వతేదీ కన్నుమూశారు. 2వ తేదీ పలు పార్టీల నాయకులు, అధికారులు రియాజ్‌ను పరామర్శించారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, నేదురుమల్లి పద్మనాభరెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, జిల్లా, రాష్ట్ర స్థాయి ఉద్యోగ సంఘ నాయకులు, పట్టణానికి చెందిన ప్రముఖులు రియాజ్ అహ్మద్‌ను పరామర్శించారు.



రియాజ్ అహ్మద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీల్ కుమార్

# 'దేశం' సభలో వైకాపా ఎమ్మెల్యేలకు సన్మానం

గల్పిక

అది ఐఆర్20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురు దోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. కాపువీధిలో స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(65+) నివాసం. తన బెడ్‌రూంలో వివేకా గాఢనిద్రలో వున్నాడు. అంతలో ఆయన ఫోన్ 'బావలు సయ్యా... హాయ్... మరదలు సయ్యా... రింబోల రింబోల రింబోలా...' అనే పాట రింగ్‌టోన్‌తో మోగింది. వివేకా ఫోన్ ఎత్తాడు. అవతల నుండి పత్తి రవీంద్రబాబు... ఏం బాస్, ఈరోజు చంద్రబాబు వస్తున్నారుగా, వెళ్లడం లేదా? అని అడిగాడు. బొచ్చు, ఆయన వస్తే నేను పోవడమేంటంటా... అయినా ఆయన ఏం పీకుదామని వస్తున్నాడు, సీఎం అయ్యాక ఈ ఏడాదిన్నర కాలంలో జిల్లాకు ఏం పొడిచాడంట... హెలికాప్టర్ ఊరకుందని వేసుకుని తిరుగుతున్నాడు. ఈరోజు ఆయన ప్రోగ్రామ్ అయిపోని... ప్రెస్‌మీట్ పెట్టి ఉతికి ఆరేస్తాను... అని ఆవేశంగా అన్నాడు. ఆ మాటకు, అవతల పత్తి రవీంద్రబాబు... ఏంటి ఉతికి ఆరేసేది నీ పంచె... ఇప్పుడు నువ్వు కాంగ్రెస్‌లో లేవు, తెలుగుదేశంలో ఉన్నావు. ఆ సంగతి మరచిపోయినట్లున్నావు, చంద్రబాబును ఎట్లంటే అట్లా మాట్లాడుతున్నావని గుర్తు చేసాడు. అప్పుడు వివేకా నాలుక్కరుచుకుని... వెధవ నోరు, వూరికే వుంటుందా... పాతికేళ్ల అలవాటు, అప్పుడే ఎలా పోతుంది... నేను చంద్రబాబు మీటింగ్‌కు పోయినా, పొరపాటున ఆయనను తిట్టే ప్రమాదముంది, కాబట్టి నేను నోరు కంట్రోల్‌లోకి వచ్చేదాకా చంద్రబాబు కార్యక్రమాలకు పోను, అయినా ఇంత అర్ధరాత్రి వేళ ఫోన్ చేసి ఈ విషయం చెప్పావేమి అని వివేకా అడిగాడు. ఇది అర్ధరాత్రా... తెల్లంగా తెల్లారింది చూడు, ఉదయం ఏడు గంటలైందని పత్తిబాబు అన్నాడు. మరి నాకేంటి అంతా చీకటిగా వుందని వివేకా అడిగాడు. పత్తిబాబుకు విషయం అర్ధమైంది... కళ్లకు నల్లద్దాలు పెట్టుకుని రాత్రి అలాగే పడుకుని ఉండుంటావు, అందుకే చీకటిగా వుంది. ముందు కళ్లకున్న ఆ నల్లద్దాలు తీయమన్నాడు. వివేకా అలాగే చేసాడు. శంకర్ 'ఐ' క్లినిక్‌లో ఆపరేషన్ చేయించుకున్న పేషంట్ అప్పుడే కళ్లు తెరచి చూస్తే కంటికి ఎంత వెలుగు కనిపిస్తుందో, వివేకాకు కూడా అదే అనుభూతి కలిగింది.

విఆర్‌సి మైదానంలో బహిరంగ సభ. వేదికమీద చంద్రబాబు నాయుడు, వెంకయ్యనాయుడులతో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరూ వున్నారు. మొదట వాకాటి నారాయణరెడ్డి మాట్లాడుతూ... తెలుగుజాతి ముద్దుబిడ్డ మన చంద్రన్న, ఆయన సీఎం కావడం మన అదృష్టం. ఆయన కోసం రక్తాన్నయినా ధారబోస్తాం, జీవితాంతం ఈ రాష్ట్రానికి ఆయనే సీఎంగా వుండాలి. నూరణాల తెలుగుదేశం నాయకులుగా ఇది మా ఆకాంక్ష అని చెప్పాడు. ఆ మాటలు విన్న సోమిరెడ్డి, రమేష్ రెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి వంటి నాయకులు ఔరా... అంటూ నోరెళ్లబెట్టారు. తర్వాత చాట్ల నరసింహారావు, ఆనం రామ నారాయణరెడ్డిలు కూడా... తెలుగుదేశం కోసం తమ జీవితాలను ధారపోస్తామని మాట్లాడారు. వారి మాటలు విన్న రమేష్‌రెడ్డి అయితే... నేను ఆ గోడెక్కి దూకుతా... అని విఆర్‌సి గోడ వైపు పరుగులు తీస్తుంటే కిలారి వెంకటస్వామినాయుడు, కోటంరెడ్డి శీనయ్యలు బలవంతంగా ఆపారు. ఏందిరా... వీళ్లింత ఘోరంగా మాట్లాడుతున్నారు, పార్టీ పెట్టినప్పటి నుండి వున్న నేనే చంద్రబాబు గురించి ఇలా ఎప్పుడూ మాట్లాడలేదు. నిన్నగాక ఈరోజు పార్టీలోకి వచ్చారు, 30ఏళ్లుగా చంద్రబాబు వెనుకే తిరుగుతున్నట్లు ఎలా మాట్లాడుతున్నారో చూడు... అంటూ రమేష్‌రెడ్డి వాపోయాడు. అది విన్న కోటంరెడ్డి... వాళ్లు అలా మాట్లాడగలరు కాబట్టే ఏ పార్టీలో ఎప్పుడు దూరినా స్టేజీ మీదుంటున్నారు. మనం అలా మాట్లాడక పోబట్టే స్టేజీ ముందుంటున్నామని చెప్పాడు. అంతలో వెంకయ్యనాయుడు స్పీచ్ మొదలుపెట్టాడు. కాంగ్రెస్ చేసిన విభజనకు ఈ రాష్ట్రం వల్లకాడు అయ్యుండాలి, అలా కాకుండా ఇలా ఉందంటే అది చంద్రబాబు పుణ్యమే. ఈ రాష్ట్ర ప్రజల అదృష్టం బాగుండబట్టే ఆయన సీఎం కాగలిగాడు. మీ తలరాతలు మార్చేనేత ఈయనే! దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు కూడా చంద్రబాబు లాంటి సీఎంనే కోరుకుంటున్నారు. కాని ఇక్కడుండేది ఒకే చంద్రబాబు. ఇక శాస్త్రవేత్తల సహకారం తీసుకుని క్లోనింగ్ ద్వారా ప్రతి రాష్ట్రానికి ఒక్కో చంద్రబాబును సృష్టిస్తే బాగుంటుందేమో అని నవ్వుతూ తన ప్రసంగం ముగించాడు. చివరిగా చంద్రబాబు మైకందుకుని... కేంద్రంలో ప్రధానినే కాదు, ప్రభుత్వాన్ని, ప్రపంచాన్ని నడిపించేది కూడా వెంకయ్యనాయుడే! కేంద్రంలో ఆయన మంత్రిగా వుండబట్టే మనం ఇక్కడ నాలుగు మెతుకులు తినగలుగుతున్నాం. ఇలాంటి నాయకుడు మన రాష్ట్రానికి చెందినవాడు కావడం మనం చేసుకున్న అదృష్టమంటూ ముగించాడు.

అప్పుడు నైట్‌రైడర్, ముదురుదోమల మంత్రి నారాయణ మైకందుకుని... ఇప్పుడు ప్రజాసేవలో తరించిన ఇద్దరు ఎమ్మెల్యేలను చంద్రబాబునాయుడు, వెంకయ్యనాయుడులు సన్మానిస్తారని చెబుతుండగా పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బొల్లినేని రామారావు, కురుగొండ్ల రామకృష్ణలు... ఆ ఎమ్మెల్యేలం తామేనన్న ఫీలింగ్‌తో సన్మానానికి రెడీ అయ్యారు. అంతలో నారాయణ మైక్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్‌లను వేదికమీదకు రావాలని ఆహ్వానించాడు. వాళ్లను పిలవడంతో పోలంరెడ్డి, కురుగొండ్ల, బొల్లినేనిలతో పాటు సోమిరెడ్డి, బీద రవిచంద్రలకు మండింది. సభ మొదలైనప్పటి నుండి చూస్తున్నాం... కాంగ్రెస్ నుండి వచ్చిన నాయకులకు మైకునిచ్చారు, ఇప్పుడు చూస్తే వైకాపా ఎమ్మెల్యేలకు సన్మానం చేస్తున్నారు. ఇది తెలుగుదేశం సభలా లేదు, కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్ సభలా వుంది. ఏం పొడిచారని వాళ్లకు సన్మానం చేస్తున్నారని అడిగారు. అప్పుడు నారాయణ ఆవేశంగా... ఆపండి... అంతకుమించి ఒక్క మాట మాట్లాడినా బాగుండదు మీకు... ఏమనుకుంటున్నారు మీరు... మా పాలిట కారుచీకట్లో కాంతిపుంజాలు వాళ్ళు. వరదల సమయంలో నెల్లూరులో ఆక్రమణలన్నీ తీసేస్తామని, బాధితులకు కొత్త ఇళ్లు కట్టిస్తామని చంద్రబాబు, నేను అరివీర భయంకరంగా వాగ్దానాలు చేసాము. తీరా వాటిపై అంచనాలు వేస్తే వందల కోట్లు ఖర్చు తేలింది. ఎలా చేయాల్రా దేవుడా అని నేను, సీఎం గారు మదనపడుతున్న తరుణంలో వీళ్లు మా పాలిట దేవుళ్లు లాగా వచ్చారు. 'నారాయణ' కాలేజీ ఆక్రమణలు తొలగించిన తర్వాతే నగరంలో ఆక్రమణలు తొలగించాలని పట్టు బట్టారు. వెదకబోయిన తీగను వాళ్లే మా కాలికి తగిలించారు. ఆక్రమణల హామీని ఎలా ఎగ్గొట్టాలా అనుకుంటున్న తరుణంలో మాకు ఆ మార్గాన్ని చూపిన మహానుభావులు వీళ్లు. ఎలాగూ మా కాలేజీ ఆక్రమణలను తొలగించేది లేదు. కాబట్టి నగరంలో ఆక్రమణల జోలికి పోనవసరం లేకుండా పోయింది. వందలకోట్ల ఖర్చు ఒక్క పేచీతో ఎగిరిపోయింది. రాష్ట్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం ఇచ్చే పని లేదు. ఇప్పుడు చెప్పండి వాళ్లకు సన్మానం చేయడం రైటా? రాంగా? అని ప్రశ్నించాడు. సమాధానం లేక, చెప్పలేక తెలుగుదేశం నేతలు మౌనంగా ఉండిపోయారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. ఇంటా బయట వ్యవహారాలలో సరైన నిర్ణయాలు తీసుకొంటారు. ముఖ్య అవసరాలకు, పనులకు ఇతరులు సహాయపడతారు. హోల్‌సేల్ వ్యాపారులకు, చిల్లర వ్యాపారులకు అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఉపాధి పథకాలు, వృత్తులు చేసుకునే వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. శుభవార్తలు వినడం జరుగుతుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. సామాజిక సంస్థల నిర్వహణ, బాధ్యతలు చేపట్టుతారు. ప్రభుత్వ పరంగా అనుమతులు, పనులు అనుకూలం కాగలవు. వ్యవసాయ దారులకు ఇబ్బందులుంటాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. వ్యవహారాలలోని ఇబ్బందులను ఇంటా బయట సమర్ధవంతంగా ఎదుర్కొంటారు.

## మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఇతరుల వ్యవహారాలను పైన వేసికొనవద్దు. ఉద్యోగులకు అనుకూల స్థితి ఉంటుంది. శుభకార్యములు నిర్ణయం కాగలవు. ఖర్చులు పెరుగుతాయి. కాని ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుంటాయి. రావలసిన బాకీలు, అదనపు ఆదాయాలుంటాయి. కుటుంబ సౌఖ్యము బాగుంటుంది. ఉద్యోగార్ధులకు అవకాశాలు లభించగలవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

గృహ నిర్మాణాలు, కాంట్రాక్టు పనులు చేసేవారికి పనులు ఆలస్యం కాగలవు. దైవ, సేవా సంస్థలకు సహాయ పడతారు. ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. వ్యాపారవృద్ధి అవకాశాలు పల్చబడగలవు. విలువైన వస్తువులు, గృహోపకరణాలు సమకూర్చుకొంటారు. ఉద్యోగులకు బాధ్యతలు, పనిభారం పెరుగుతుంది. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వివాహ ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. కళా క్రీడా సాంకేతిక రంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. అనుకున్న పనులు చురుకుగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. వివాదాల నుండి బయట పడతారు. బిల్లుల చెల్లింపులు సకాలంలో జరుపుతారు. కుటుంబ సభ్యులతో భిన్నాభిప్రాయాలుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

స్థిరాస్తుల వ్యవహారాలు వాయిదా వేసికొనండి. బిడ్డల విద్యా ఆరోగ్య విషయాలందు దృష్టి పెట్టండి. ఆటం కాలను అధిగమించి ఆర్థికంగా స్థిరపడతారు. మంచి వ్యాపారావకాశాలుండి ఫలించి నిర్ణయం కాగలవు. అనుకున్న పనులు జరుగుతున్నా టెన్షన్ ఎక్కువుగా ఉంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. అనుకోని ప్రయాణాలుంటాయి. విద్యార్థిలు మరింత శ్రమించాలి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 08.01.2016 నుండి
తేది. 14.01.2016 వరకు

ఈ వారము మీనంలో కేతువు, సింహంలో గురువు, కన్యలో రాహువు, తులలో కుజుడు, వృశ్చికంలో శని శుక్రులు, ధనుస్సులో రవి, మకరంలో బుధుడు, ధనుర్మకర కుంభ రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**
ముహూర్తములు లేవు.

తేది 14 గురువారము భోగి పండుగ
తేది 15 శుక్రవారము సంక్రాంతి పండుగ
తేది 16 శనివారము కనుమ పండుగ

### మార్గశీర్ష మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 8 | శుక్ర | త్రయోదశి | ఉ॥ గం.7.22వ॥ |
| తేది. 9 | శని | చతుర్దశి | ఉ॥ గం.7.45వ॥ |
| తేది. 10 | ఆది | అమావాస్య | ఉ॥ గం.7.35వ॥ |

### పుష్య మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 11 | సోమ | పాడ్యమి | ఉ॥ గం.6.56వ॥ |
| | పిదప | విదియ | రా॥ గం.5.52వ॥ |
| తేది. 12 | మంగళ | తదియ | రా॥ గం.4.23వ॥ |
| తేది. 13 | బుధ | చతుర్థి | రా॥ గం.2.33వ॥ |
| తేది. 14 | గురు | పంచమి | రా॥ గం.12.26వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అనుకున్న పనులు సవ్యంగా జరుగుతుంటాయి. సొంత నిర్ణయాలు తీసుకొంటూ వచ్చిన ఆర్థిక, సామాజిక అవకాశాలను ఉపయోగించుకొనడం మంచిది. కుటుంబంలో కొద్ది అనుకూలత తక్కువగా ఉంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఉద్యోగులకు పనిభారం వత్తిడి పెరుగుతుంది. చేబదుళ్ళు, హామీలు ఇవ్వకండి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనవసర విషయాలలో చొరవ చూపవద్దు. పనులు సమర్ధవంతంగా నిర్వహిస్తారు. వ్యవహారంలో చిన్నచిన్న సమస్యలున్నా సర్దుబాటు కాగలవు. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుండి, ఆదాయం తృప్తికరం. బంధుమిత్రులతో సఖ్యత బాగుంటుంది. కుటుంబ సౌఖ్యము, విద్యా ప్రగతి బాగుంటుంది. షేర్లు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగులకు పనిభారం పెరగుతుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి ఉపాధి రంగాల వారికి అనుకూలత బాగుంటుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. కుటుంబంలో అనుకూలత తక్కువ మరియు భిన్నాభిప్రాయాలుంటాయి. సర్దుకొని పోవడం మంచిది. వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలు దొరికి అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. స్థిరాస్తులు, షేర్ల మీద ఆదాయం పెరుగుతుంది. విద్యాప్రగతి బాగుంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థిక వ్యవహారాలు, లౌకిక వ్యవహారాలు పెండింగ్‌లో పడతాయి. పిల్లల విద్యా వివాహ విషయాలందు శ్రద్ధ చూపుతారు. వృత్తి వ్యాపారాలు పల్చబడతాయి. అవకాశాలు తగ్గి ఆదాయం తగ్గుతుంది. అధికారులకు స్థాన మార్పులు, ఉద్యోగులకు పనిభారం, వత్తిడి పెరుగుతుంది. కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. పెట్టుబడి అవకాశాలు బాగుండినా, పనులు నిదానంగా జరుగుతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఉద్యోగులకు పనిభారం ఉండినా, గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. స్థిరాస్తుల వ్యవహారాలను వాయిదా వేసుకొనండి. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. వాహనాలు నడిపేవారు, యంత్రాలు, కరెంటుతో పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి. వృత్తి ఉపాధి పథకాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వ్యాపార వర్గాలకు అభివృద్ధి ఆదాయం బాగుంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. మీ ఆరోగ్యం, బిడ్డల ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపుతారు. రావలసిన బాకీలు కొంతవరకు లభిస్తాయి. అధికారులకు స్థాన మార్పు, ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి అనుకూలత బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. పనులందు టెన్షన్ ఎక్కువుగా ఉంటుంది. కోర్టు వ్యవహారాలు అనుకూలం కాగలవు.

## కళ్యాణ వైభవం...!



నెల్లూరులోని ప్రముఖ వైద్యులు డాక్టర్ మొగరాల సుబ్రహ్మణ్యంరెడ్డి - రజనిల కుమారుడు **సాయివరుణ్ నీల్ - వినీష** (పొదలకూరు మండలం సూరాయపాలెం వాస్తవ్యులు నోటి వెంకటరమణారెడ్డి - కృష్ణకుమారిల కుమార్తెల కళ్యాణం డిసెంబర్ 24వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# ఆ ఎమ్మెల్యే అంతే.. అదో టైపు!

## • ప్రజలకు చిక్కడు... అధినేతలకు దొరకడు



ఉదయగిరి నియోజకవర్గ ప్రజలది విచిత్ర పరిస్థితి. గత ఎమ్మెల్యేలే ఎంతో ఉత్తములు అనిపించే విధంగా ఇక్కడ ఎమ్మెల్యేలు తయారవుతున్నారు. 1978 నుండి 1984దాకా యం.వెంకయ్యనాయుడు ఇక్కడ ఎమ్మెల్యేగా చేశారు. ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారు. 1985లో ఎమ్మెల్యేగా వచ్చిన మేకపాటి రాజమోహన్‌రెడ్డిని చూసిన ప్రజలు వెంకయ్యను ఎంతో ఉత్తముడిగా భావించారు. ఆ తర్వాత 1989లో వచ్చిన మాదాల జానకిరాంను చూసి ఇతనికంటే మేకపాటి రాజమోహన్‌రెడ్డే నయమనుకున్నారు. 1994 నుండి 2004 దాకా కంభం విజయరామిరెడ్డి ఉదయగిరి ఎమ్మెల్యేగా ఉన్నాడు. 2004 నుండి 2014 దాకా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేగా చేశాడు. మేకపాటి శేఖర్‌రెడ్డి కంటే కంభం విజయరామిరెడ్డే నయమని అక్కడి జనం అనుకున్నారు. 2014ఎన్నికల్లో ఉదయగిరి ప్రజలు బొల్లినేని రామారావును గెలిపించారు. గతంలో ఉదయగిరి ఎమ్మెల్యేలుగా పనిచేసిన అందరి నాయకులకు బొల్లినేని రామారావు మంచి పేరు తెచ్చాడు. రామారావు కంటే కూడా గతంలో పనిచేసిన ఎమ్మెల్యేలే నయమని, కనీసం ప్రజల్లో అప్పుడప్పుడన్నా తిరిగేవాళ్లని స్థానికులంటున్నారు.

బొల్లినేని రామారావు హైక్లాస్ కాంట్రాక్టరే కాదు, హైక్లాస్ ఎమ్మెల్యే కూడా! ఆయన ఉదయగిరి నియోజకవర్గంలో కంటే కూడా తాను కాంట్రాక్ట్ పనులు చేసే మహారాష్ట్రలోనే ఎక్కువుగా ఉంటుంటాడు. నెలలో ఒకట్రెండు సార్లు నియోజకవర్గానికి వస్తాడు. కలిగిరిలో క్యాంప్ పెడతాడు. అన్ని మండలాల నాయకులను అక్కడికే పిలిపించుకుని మాట్లాడిపోతుంటాడు. ఆయన గ్రామాల్లోకి పోవడం గాని, ప్రజా సమస్యలు వినడం, పరిష్కరించడం గాని చాలా అరుదైన విషయంగా చెప్పుకోవచ్చు. పలువురు రాష్ట్ర మంత్రులు ఉదయగిరి నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సందర్భంలో కూడా బొల్లినేని రామారావు మహారాష్ట్రలో ఉన్న దాఖలాలున్నాయి. మొన్న 3వ తేదీ కలిగిరి మండలం పెద్దపాడులో జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నాడు. ఆ రాత్రికి ఆయన కావలిలోనే బసచేశాడు. 4వ తేదీ ఉదయం కూడా కావలిలోనే వున్నాడు. జిల్లా తెలుగుదేశం నాయకులంతా అక్కడే వున్నారు. బొల్లినేని మాత్రం ముఖ్యమంత్రి ఉన్నాడన్న సంగతి కూడా పట్టించుకోకుండా కాంట్రాక్ట్ పనుల కోసం 3వ తేదీ అర్ధరాత్రే మహారాష్ట్రకు పయనమైపోయినట్లు తెలిసింది. వందలు, వేల కోట్లు సంపాదించుకున్న వారికి ఎమ్మెల్యే, ఎంపి వంటి పదవులు అనుభవించాలనేది ఒక ఫ్యాషన్‌గా మారింది. వందల కోట్లలో ఓ 50కోట్లు ఖర్చు చేయడం వీరికి పెద్ద సమస్య కాదు. ఎన్ని వేల కోట్లున్నా అధికార దర్పం రాదు కదా! అది కావాలంటే పదవి కావాలి. పదవులు కావాలంటే కోట్లు ఖర్చు చేయాలి. ఆ బాపతులో వచ్చిన వారిలో ఒకరే బొల్లినేని రామారావు. ఎమ్మెల్యే కావాలన్న కోరిక నెరవేరాక ప్రజలు, వారి సమస్యలతో వీళ్లకేం పని... వాళ్ల కాంట్రాక్ట్ పనులు ముఖ్యం కాని!

# ఆదిమానవుని అద్భుత కళాసృష్టి

నెల్లూరుజిల్లా సీతారామపురం మండలంలో వున్న ఘటికసిద్ధేశ్వరం ప్రాంతంలో దాదాపు 30 వేల ఏళ్ళ నాటి ఆది మానవుని చిత్రాలు వెలుగులోకి వచ్చాయి. ఇవి మధ్యయుగం నాటి ఆదిమానవుడు వేసిన చిత్రాలని, అటు ఆదిమానవుని జీవితానికి సంబంధించి, ఇటు నెల్లూరు ప్రాచీన చరిత్రకు సంబంధించి పరిశోధనలకు ఈ చిత్రాలు ఎంతో ముఖ్యమైనవని భావిస్తున్నారు. దీంతో, దాదాపు 30 వేల ఏళ్ల క్రితమే ఆదిమానవుడు జిల్లాలో నివసించినట్లు ఈ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. అన్ని వేల ఏళ్ల క్రితం ఆదిమానవులు వేసిన ఈ చిత్రాలు ఇంతకాలంగా చెక్కుచెదరకుండా భద్రంగానే వుండడం, అంత ప్రాచీన కాలంలోనే ఎర్రని రంగుతో వారు చిత్రాలు వేయగలగడం ఎంతో విశేషం. ఈ చిత్రాలు వెలుగుచూడడంతో జిల్లా ప్రాచీన చరిత్రకు సంబంధించి కీలకమైన ఆధారాలు లభ్యమైనట్లేనని చారిత్రిక పరిశోధకులు భావిస్తున్నారు. ప్రకాశం జిల్లాలోని కనిగిరికి చెందిన కొండ్రెడ్డి భాస్కరరెడ్డి ఇటీవల తన కుటుంబీకులతో ఈ ప్రాంతంలో కొండకోనలను వీక్షించడానికి వచ్చినప్పుడు, ఆయన కుమార్తె మన్విత అక్కడి బండరాళ్ళపై వున్న ఈ చిత్రాలను తొలిసారిగా చూడడం జరిగిందని, వాటిని తండ్రికి చూపగా, చారిత్రిక పరిశోధనల పట్ల ఎంతో ఆసక్తి వున్న ఆ బాలిక తండ్రి ఈ విషయాన్ని పురావస్తుశాఖ వారికి తెలియజేయడంతో ఈ చిత్రాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. అత్యంత ప్రాచీనమైన ఈ చిత్రకళా ప్రదేశాన్ని ఈ నెల 2న జిల్లా పురావస్తు శాఖ

## సీతారామపురం మండలంలో 30వేల ఏళ్ళ నాటి ప్రాచీన చిత్రాలు



అసిస్టెంట్ డైరెక్టర్ జాన్ కమలాకర్‌తో పాటు, పలువురు పురావస్తు అన్వేషకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ, మధ్య శిలాయుగం నాటి ఎంతో అరుదైన, అపురూపమైన ఆదిమ మానవుని అద్భుత చిత్రకళను ఇక్కడ చూడవచ్చన్నారు. సీతారామపురానికి ఏడుమైళ్ళ దూరంలో వున్న కొండ గుహలో సుమారు నూరు అడుగుల వెడల్పుతో వున్న ఒక పెద్ద రాతిబండపై ఈ చిత్రాలున్నాయని, దాదాపు 12 అడుగుల ఎత్తులో ఇలాంటివి సుమారు 20కి పైగానే చిత్రాలు వుండడం ఎంతో విశేషమని వారు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలోని కొండలో ప్రాచీనకాలం నాటి ఆదిమానవులు నివసించివుంటారని, ఆదిమానవుల జీవనాన్ని ప్రతిబింబించే అనేక బొమ్మలు ఇక్కడ చిత్రించడం ఇంకా విశేషమని, ఇవి దాదాపు 30వేల సంవత్సరాల నాటివని వారు అంచనా వేస్తున్నారు. ఆదిమానవులు చిత్రీకరించిన బొమ్మలున్న ప్రాంతాలు రాష్ట్రంలో ఇప్పటివరకు 13 వున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారన్నారు. ఈ చిత్రాలు అనేక ప్రత్యేకతలు కలిగివున్నాయని, అందులోనూ రెండున్నర అడుగుల ఎత్తులో, ఎరుపురంగులో..చేతిలో మంటతో వున్న ఆదిమానవుడి ఆకృతి విశేషమైనదని, దేశంలోనే ఇది ఎంతో అరుదైన ప్రాచీన చిత్రంగా భావిస్తున్నామని వారన్నారు. ఈ చిత్రంతో పాటు ఇంకా అనేక చిత్రాలు ఇక్కడ ఆదిమానవులు చిత్రీకరించివున్నారని, దున్నపై కూర్చుని వున్న మనిషి, గుర్రాన్ని తాడుతో లాక్కెళుతున్న మనిషి, అయిదు జింకలు, ఆకులతో కూడిన తీగలు, త్రిభుజాలు, వృత్తాలు ఇలా పలురకాల చిత్రాలు ఇక్కడ వుండడం విశేషమన్నారు. జిల్లాలో ఇవి తొలిసారిగా బహిర్గతమయ్యాయని, ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి, ఆ చిత్రాలను పరిరక్షించేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామని వారు పేర్కొన్నారు. ఈ చిత్రాలను పరిశీలించిన వారిలో పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌తో పాటు, పురావస్తు అన్వేషకులు డాక్టర్ ధనిశెట్టి లెనిన్, కొండ్రెడ్డి భాస్కరరెడ్డి, రమణారెడ్డి, ఎస్‌కె అమ్మ సావలి, అల్లం రామ్మూర్తి, గువ్వకల హరీశ్ వున్నారు. ఏదేమైనా, వేనవేల ఏళ్ళ నాటి మధ్యయుగం ఆదిమానవుడు వేసిన చిత్రాలు నేటికీ జిల్లాలో పదిలంగా వుండడం ఎంతో అద్భుతం.. ఆశ్చర్యకరం. నెల్లూరుజిల్లా ప్రాచీన చరిత్రను కళ్ళకు కట్టినట్లుగా తెలియపరిచే నాటి ఆదిమానవుడు వేసిన ఈ అపురూప, అరుదైన చిత్రాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం వెంటనే పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సివుంది. ప్రాచీన కాలంనాటి విశేషాలను అధ్యయనం చేసేందుకు వీలుగా గట్టి భద్రతతో ఈ ప్రాంతాన్ని పురావస్తుశాఖ ఆధీనంలో వుంచి, భావితరాల వారికోసం ఈ చిత్రవేదికను పదికాలాల పాటు భద్రపరచాల్సి వుంది.



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ



సోమిరెడ్డి ఇంట నూతన సంవత్సర వేడుక

# నెల్లూరులో కొత్త సంవత్సర హంగామా

ఈ నెల 1వ తేదీన నూతన సంవత్సర వేడుకలు నెల్లూరులో ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, జిల్లా ఉన్నతాధికారుల నివాసాలు శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చినవారితో కిటకిటలాడాయి. జిల్లా కలెక్టర్ యం.జానకి, ఎస్పీ డా॥ గజరావు భూపాల్‌లతో పాటు తెలుగుదేశం, బీజేపీ, వైకాపా, కాంగ్రెస్ నేతలు తమ నివాసాల వద్ద శిబిరాలు ఏర్పాటు చేసి వచ్చినవారికి అతిథి మర్యాదలు చేశారు. పూలబొకేలు, పండ్లు, స్వీట్లు వ్యాపారాలు జోరుగా సాగాయి.




ఎమ్మెల్యే అనిల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ద్వారకానాథ్



'దేశం' నేత పెళ్ళకూరు ఇంట సందడి

# కేంద్ర మంత్రులచే అభివృద్ధికి శ్రీకారం

దేశాభివృద్ధి కోసం కేంద్రప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన కేంద్రమంత్రులు మహేశ్‌శర్మ, లావర్‌చంద్ గెహ్లోట్‌లతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. వెంకటాచలం మండలం సరస్వతీనగర్‌లో వికలాంగుల కోసం 25కోట్లతో నిర్మించనున్న ప్రాంతీయ మానసిక వికలాంగుల పునరావాస కేంద్రానికి శంకుస్థాపన చేశారు. అలాగే గొలగమూడిలో ఐఐటిటిఎం భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ ప్రధాని నుండి కేంద్రమంత్రివర్గంలోని ప్రతి ఒక్కరూ ప్రతిక్షణం దేశాభివృద్ధి కోసమే ఆలోచిస్తున్నారన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 'కిమ్స్' ఆసుపత్రి వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వెంకయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో ఆయన వెంట రాష్ట్రమంత్రులు పి.నారాయణ, కామినేని శ్రీనివాస్, సిద్ధా రాఘవరావు, ఎంపీలు వరప్రసాద్, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు మేయర్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.




ఈ నెల 7వ తేదీన విజయవాడలో నెల్లూరుజిల్లాకు చెందిన రచయిత రాచపాళెం రఘు రచించిన 'లోకాయత శతకం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నార్వే దేశానికి చెందిన మానవతావాద సంఘం నిర్వాహకుడు రాబర్ట్ రస్టాడ్, పక్కన రఘు, మురళీమోహన్‌రాజు

వచ్చేసాయ్...

# అమరావతి బస్సులు




సంక్రాంతి పండుగ కానుకగా ఏపియస్ఆర్టీసీ అధునాతన వసతులతో అమరావతి బస్సులను ప్రారంభించనుంది. నెల్లూరుజిల్లా ప్రయాణీకులకు ప్రయాణంలో అత్యాధునిక సేవలందించడానికి నాలుగు బస్సులు నెల్లూరుకు చేరాయి. ఈ బస్సులను నెల్లూరు-1 డిపోకు రెండు, నెల్లూరు-2 డిపోకు రెండు చొప్పున కేటాయించారు. వోల్వో కంపెనీ ద్వారా తయారైన మల్టీయాక్సిల్ బస్సులు ప్రత్యేక వసతులతో ప్రయాణీకులను ఆకట్టుకోనున్నాయి. 14ఆటోమ్యాటిక్ గేర్లు, డ్రైవర్ ప్రమేయం లేకుండా సమయానుకూలంగా వేగం పెంచుకోవడం, తగ్గించుకోవడం చేస్తాయి. అంతేకాకుండా అత్యాధునిక ఎమర్జెన్సీ ద్వారం వుంది. ప్రమాద సమయంలో ప్రాణాపాయం కలగకుండా ఈ ద్వారం పని చేస్తుంది. ప్రమాదం జరిగిన వెంటనే ఈ ద్వారానికి సంబంధించిన తలుపులు వాటంతట అవే తెరుచుకుంటాయి. తలుపు భాగం నుంచి కిందికి నిచ్చెన సదుపాయం వుంది. మూడు సిసి కెమెరాలు ఈ బస్సులో ఉండటం మరో ప్రత్యేకత. డ్రైవర్ సీటు దగ్గర ఒకటి, బస్సు వెనుక వైపు ఒకటి, మధ్యభాగంలో ఒకటి అమర్చారు. రెండు ఎల్ఇడి టీవీలు ఉన్నాయి. ముందుభాగంలో ఒకటి, మధ్య భాగంలో మరొకటి ఏర్పాటు చేశారు. ఇంజన్ బ్రేక్ విధానం దీని ప్రత్యేకత. ఇప్పటివరకు ప్రమాదం జరిగే సమయంలో బస్సును నిలిపేందుకు టైర్లను ఆపేందుకు బ్రేక్‌లు ఉపయోగిస్తారు. అమరావతి బస్సుకు ఇంజిన్‌బ్రేక్ విధానం వుంది. దీంతో అన్నింటికంటే ముందుగా ఇంజిన్‌ను ఆపుచేసి జరగబోయే ప్రమాదాన్ని పూర్తిగా నివారించవచ్చు. నెల్లూరు-1 డిపో అమరావతి బస్సులు నెల్లూరు నుంచి హైదరాబాద్ వరకు, నెల్లూరు-2 డిపో అమరావతి బస్సులు నెల్లూరు నుండి బెంగుళూరుకు నడపనున్నారు. అమరావతి బస్సులు గరుడబస్సులకన్నా 120 కి.మీల వేగంతో ప్రయాణం సాగిస్తాయి. ఛార్జీలు నిర్ణయించాల్సి వుంది. త్వరలో మరో నాలుగు బస్సులు రీజియన్‌కు రానున్నట్లు సమాచారం.

# ఇసుకపై... మళ్ళీ మస్కా

(మొదటి పేజీ తరువాయి)

అక్రమ రవాణా సాగించారు. నియోజకవర్గ స్థాయి నాయకుల నుండి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు అవినీతి ఇసుక సొమ్ము వాటాలందాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ 18నెలల్లో కోట్లాది రూపాయల ఇసుక దోపిడీ జరిగింది. మహిళా సంఘాల ముసుగులో కొందరు నాయకురాళ్లు కూడా కోట్లు గడించారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్నందుకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అక్కడి తహశీల్దార్ వనజాక్షిని ఇసుక రీచ్‌లోనే జుట్టు పట్టుకుని ఈడ్చి కొట్టిన దృశ్యాలను రాష్ట్రమంతా చూసింది. విశాఖ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణ, నెల్లూరు, కడప, అనంతపురం జిల్లాలో వందల కోట్ల రూపాయల ఇసుక దోపిడీ జరిగింది. ఒక పర్మిట్‌తో ఒక్కో బండి రోజుకు పదేసి ట్రిప్పులు తిరిగేవి. అక్రమరవాణాను నివారించడానికంటూ అధికారులు ఏర్పాటు చేసిన సాంకేతికత ప్రయోగాలేవీ అధికారపార్టీ వారి ఇసుక దోపిడీని నివారించలేకపోయాయి. ఇంత భారీ ఎత్తున ఇసుక దోపిడీ జరుగుతున్నా సామాన్యుడికి మాత్రం ఇంకా ఇసుక అందని ద్రాక్ష మాదిరిగానే వుంది.

18నెలలు అధికారపార్టీ నేతలు దోచుకున్నంత దోచుకుని రీచ్‌లలో ఇసుకను ఊడ్చేసారు. ఇప్పుడు ప్రభుత్వం ఇసుకరీచ్‌లకు పాత పద్ధతిలోనే టెండర్లకు శ్రీకారం చుట్టింది. అయితే సామాన్య ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తెస్తామన్న పాలకుల మాటలు ఇక్కడా ఆచరణలోకి వచ్చే అవకాశం లేదు. ఎందుకంటే కొత్త విధానం కూడా సామాన్య ప్రజలకు అనుకూలంగా లేదు. ఒక ఘనపు మీటరు ఇసుకకు ప్రభుత్వమే 550రూపాయలు ధరగా నిర్ణయించింది. రీచ్‌ను పాడుకున్న కాంట్రాక్టర్‌కు మాత్రం ఒక ఘనపు మీటరు ఇసుక 178రూపాయలే పడుతుంది. ప్రభుత్వానికి సంబంధించిన పనులకు మాత్రం తక్కువ ధరకే ఇసుకను రవాణా చేయాలని నిబంధన పెట్టారు. సామాన్య ప్రజలకు ఏ మాత్రం ధర తగ్గించడం లేదు.

18నెలలు మహిళా సంఘాల పేరుతో ఇసుక దోపిడీ జరిగింది. ఇక అధికారపార్టీ నేతలే కాంట్రాక్టర్లుగా మారి ఇసుకరీచ్‌లను పబ్లిక్‌గానే దోచే కార్యక్రమానికి ప్రభుత్వం పచ్చజెండా వూపినట్లయ్యింది.

అతిధులొచ్చారు..

# జిల్లాకు పండుగ తెచ్చారు



**కొందరు గోవుల్ని పూజిస్తారు..మరికొందరు చెట్లను పూజిస్తారు. ఇంకొందరు నాగుల్ని దేవుళ్ళుగా కొలుస్తారు. అయితే, ప్రకృతినీ, పర్యావరణాన్నీ మరింతగా ప్రేమించే ఈ జిల్లావాసులు మాత్రం..వాటన్నిటితో పాటు ప్రత్యేకించి పక్షులను మరింత అభిమానంతో చూస్తారు. వాటిని దేవతలుగా కూడా ఆరాధిస్తారు. ఇప్పటికీ నేలపట్టు, తడ, దొరవారిసత్రం మండలాల్లోని అనేక గ్రామాల్లో ఈ పక్షులను దేవతా పక్షులనే పిలుస్తారు. రంగురంగుల రెక్కలతో, ఎంతో ఆహ్లాదం కలిగించే ఈ విదేశీ వలస పక్షుల విహారాన్ని చూడడం అందరికీ ఎంతో ఇష్టం కూడా. అందుకే ప్రభుత్వం ఆ ఆహ్లాదాన్ని అందరికీ పంచాలనే ఉద్దేశ్యంతో ఏడాదికోసారి పెద్దఎత్తున 'పక్షుల పండుగ' నిర్వహిస్తుండడం ఎంతో అభినందనీయం. అందులోనూ ఇలాంటి విశిష్టమైన పక్షుల పండుగ ఈ జిల్లాకే సొంతం కావడం జిల్లా అదృష్టమనే చెప్పాలి. జిల్లా అధికారయంత్రాంగం ఈ నెల 9,10 తేదీల్లో సూళ్ళూరుపేటలో ఎంతో వేడుకగా.. కనువిందుగా ఈ పక్షుల పండుగ (ఫ్లెమింగో ఫెస్టివల్) నిర్వహిస్తోందన్నారు. మరోవైపు పర్యాటకులు, పక్షిప్రేమికులు, బాలబాలికలు, విద్యార్థులు, పిల్లలు-పెద్దలు, ప్రముఖులు అందరూ పక్షులను తిలకించేందుకు విచ్చేస్తారు కనుక, ఆయా ప్రాంతాల్లో పక్షుల సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేసింది.**

పండుగకు అతిధులంతా విచ్చేశారు.. ఇక పండుగ సందడి సంగతి వేరే చెప్పాలా?.. అందులోనూ పక్షుల పండుగ అంటే సంబరం అంతా ఇంతా కాదు. ఈ పక్షులు కూడా అత్యధికం విదేశాల నుంచి వచ్చే వలస పక్షులే. ఎంతెంతో దూరం నుంచి.. దూరదేశాల నుంచి సముద్రాల మీదుగా ఎగురుతూ ఇక్కడికి వచ్చే ఫ్లెమింగోలు, ఫెలికాన్‌లు వగైరా పక్షులన్నిటికీ ఈ జిల్లా ఒక విడిది ప్రాంతం కావడం విశేషం. నేలపట్టు అంటేనే పక్షులకు ఆటపట్టుగా వుంటుంది. ఇక పులికాట్ సరస్సంటే పక్షులకు ఆహార విహార సరస్సేనని చెప్పవచ్చు. ఆసియా ఖండంలోనే సహజసిద్ధంగా ఏర్పడిన రెండవ అతి పెద్ద ఉప్పు నీటి సరస్సు పులికాట్. ఇది ఆంధ్ర-తమిళనాడు సరిహద్దుల్లో వుంది. దాదాపు 6 వందల కిలోమీటర్ల పరిధిలో విస్తరించి వుంది. ఎక్కువగా ఈ పక్షులు తడ, దొరవారిసత్రం, సూళ్ళూరుపేట మండలాల ప్రాంతాల్లో విస్తరించివున్న పులికాట్ సరస్సులో విహరిస్తుంటాయి. 'పక్షుల పేరడైజ్'గా పేరొందిన ఈ సరస్సులో దిగి చేపలను, క్రిమికీటకాదులను ఆహారంగా స్వీకరిస్తుంటాయి. అందుకే పులికాట్ సరస్సు విదేశీ వలసపక్షుల ఆహారభాండాగారంగా కూడా ప్రసిద్ధికెక్కింది. ఈ పక్షులన్నీ ఆ ప్రాంతాల్లో ఆహార విహారాదులు పూర్తిచేసుకుని తిరిగి దొరవారిసత్రం మండలంలోని నేలపట్టుకు వెళ్ళి అక్కడున్న మడ చెట్లపై నివసిస్తుంటాయి. ప్రతి ఏటా అక్టోబర్ నుంచి మార్చి నెలాఖరు దాకా దేశ విదేశాలకు చెందిన దాదాపు లక్షలాది పక్షులు ఈ ప్రాంతాలకు వస్తుంటాయి. అందువల్ల సూళ్ళూరుపేట, దొరవారి సత్రం, తడ మండలాల్లోని ఆ ప్రాంతాలన్నీ ఈ పక్షుల కిలకిలారావాలతో కళకళగా వుంటాయి. అవన్నీ ఇక్కడే ఆహారం స్వీకరించి.. తమ విహారంతో అందరినీ అలరించి ప్రతిఏటా కొద్దికాలం పాటు ఇక్కడే నివసిస్తాయి. ఇక్కడే గుడ్లు పెట్టి..వాటిని పొదిగి పిల్లలను చేసి, ఆ పిల్లలకు రెక్కలొచ్చేదాకా ఇక్కడి చెట్లపైనే వుండి, తమ సంతతిని వృద్ధి చేసుకుని, అవి పెద్దవయ్యాక ఆ పిల్లలతో సహా ఇక్కడినుంచి తిరిగి తమ స్వస్థలాలకు ఎగిరి వెళ్ళిపోతుంటాయి. ఈ విశేషమైన పక్షులను ఇక్కడి గ్రామాల్లో ప్రజలు నేటికీ 'దేవతా పక్షులు'గానే పిలుస్తుంటారు. వీటి రాకను గ్రామస్తులు అదృష్టంగా భావిస్తుంటారు. అంతేకాదు, ఆ పక్షిదేవతలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ.. వాటికి ఎలాంటి హానీ జరగకుండా చూస్తారు.

**ఫ్లెమింగో, పెలికాన్‌ల సోయగాలు :**

ఈ ప్రాంతాలకు దాదాపు 150 రకాల పక్షులు వచ్చి సందర్శకులను కనువిందు చేస్తుంటాయి. వీటిలో అత్యధికంగా వచ్చే ఫ్లెమింగో పక్షులు ప్రత్యేక ఆకర్షణ. ఇంకా సైబీరియా-నైజీరియాల నుంచి గూడబాతులు(పెలికాన్‌లు) పెద్ద సంఖ్యలో వస్తుంటాయి. వీటి అందాలు అందరినీ అలరిస్తుంటాయి. ఈ పక్షుల ఆవాస, విహార ప్రాంతాలుగా వున్న పులికాట్, నేలపట్టు ప్రాంతాలు పక్షుల రక్షిత ప్రాంతాలుగా కూడా గుర్తింపులోకి వచ్చాయి. దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు ప్రాంతం ఈ వలస పక్షులకు నివాస స్థానం. ఇక్కడ ప్రకృతి వాతావరణం కూడా ఎంతో ఆహ్లాదంగా వుంటుంది. ఇక్కడున్న మంచినీటి చెరువులో పెరిగిన మడ చెట్లు ఈ పక్షులకు గూళ్ళు కట్టుకుని నివసించేందుకు వీలుగా వుంటాయి. ఆహారానికీ ఎలాంటి లోటూ వుండదు. ఎక్కువగా గూడబాతు కొంగలు ఇక్కడ నివసిస్తుంటాయి. సమీపంలోని వెదురుపట్టు ప్రాంతం ఎర్రకాళ్ళ కొంగలకు శీతాకాలపు విడిదిగా వుంటుంది. ఇంకా తడ, అటకానితిప్ప, భీమునివారిపాళెం, ఇరకం దీవి, సూళ్ళూరుపేట, దొరవారి సత్రం మండలాల్లోని పలు గ్రామాల్లో ఈ పక్షులు విహరిస్తుంటాయి. ఈ పక్షులతో పాటు ఇక్కడి స్వాతి కొంగలు, తెల్ల కంకణాయిలు, పాలపిట్టలు వగైరాలన్నీ కూడా కలసి విహరిస్తుంటాయి. అటు ప్రకృతిని శోభాయమానం చేస్తూ, ఇటు పర్యావరణాన్ని కూడా పరిరక్షిస్తూ.. అనాదిగా ఈ జిల్లాకు వస్తున్న ఈ వేలాది విహంగాల విహారాలను కళ్ళారా చూడడం, వాటి కిలకిలారావాలను చెవులారా వినడం నిజంగానే ఒక అదృష్టం. అందుకే వాటి రాకే ఒక సంబరంగా జిల్లాలో పక్షులపండుగ భారీగా జరుగుతోంది. ప్రత్యేకించి సూళ్ళూరుపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణం ఈ పండుగ వేదికగా సంబరాలు జరుగుతున్నాయి. ఈ పండుగను పురస్కరించుకుని శాఖలవారీగా వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటుచేశారు. అందరినీ అలరించే సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యాజిక్ షోలు, నవ్వుల బజార్ తదితర కార్యక్రమాలన్నీ ఏర్పాటు చేశారు. చిన్నారులు, విద్యార్థులెంతో మంది ఈ సందర్భంగా పక్షుల గురించి ఎంతో ఆసక్తితో తెలుసుకుంటూ వుంటారు కూడా. 'పక్షుల పండుగ' అంటే.. అదొక ప్రకృతి ఆరాధన.. సాటి ప్రాణులైన పక్షుల పట్ల ఎనలేని ప్రేమారాధన. అందుకే, ఈ పండుగతో.. ఈ సంక్రాంతి రోజుల్లో జిల్లాకు ముందస్తు పెద్దపండుగ వచ్చినట్లయింది. పక్షుల పండుగ పెద్దపండుగలా ఇంటిల్లి పాదీ అందరూ కలసి ఆనందంగా జరుపుకుంటూ ఈ అందమైన పక్షుల విహారాన్ని చూడగలగడం ఎంతైనా ఒక మధురానుభూతి. పిల్లలు పెద్దలూ అందరూ ఎంతో ఇష్టపడే ఈ పక్షుల పండుగకు మనమూ వెళ్దామా!...

# నెల్లూరు మహానగరమే

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా మొన్నటి పర్యటనలో చంద్రబాబు, వెంకయ్యలిచ్చిన హామీలు అమలు జరిగే దాని పైనే అనుమానాలున్నాయి. 2014ఎన్నికల ఫలితాల వల్ల నెల్లూరుజిల్లాను ఇద్దరు కూడా చిన్నచూపు చూసినవాళ్ళే! ఈ జిల్లాలో సీట్లు తక్కువ వచ్చాయని నెల్లూరుజిల్లాకు ఏ పనులు అడగొద్దని చంద్రబాబే ఈ జిల్లా నాయకులకు చెప్పాడని వార్తలు రావడం తెలిసిందే! ఇక వెంకయ్యనాయుడైతే ఈ జిల్లాలో బీజేపీకి ఒక్క సీటు రాలేదని కేంద్రమంత్రి అయ్యాక కొద్దిరోజుల పాటు ఈ జిల్లాలోనే అడుగు పెట్టలేదు. మొదట్లో ఈ జిల్లా అభివృద్ధి పట్ల వాళ్ళు అంత విముఖత చూపారు. అయితే తల్లి మీద బిడ్డ ఎంతకాలం అలిగి వుండగలడు. వెంకయ్యనాయుడు కూడా అంతే! కన్నతల్లి లాంటి నెల్లూరుజిల్లా మీద ఆయన అలక కూడా బిడ్డ అలకలాంటిదే! అలక తీరాక నెల్లూరుజిల్లా అభివృద్ధిపై ఆయన బాగానే శ్రద్ధ పెడుతున్నాడు. దుగరాజపట్నం పోర్టులో కదలిక, కృష్ణపట్నం-ఓబులాపురం రైల్వేలైన్, శ్రీకాళహస్తి - నడికుడి రైల్వేలైన్ పనులు వేగవంతం కావడం, నెల్లూరు నగరాభివృద్ధిని కాంక్షిస్తూ రూపొందించిన 'నెల్లూరు నెక్ట్స్' వంటివన్నీ కూడా వెంకయ్య కృషి ఫలితమే! నెల్లూరును స్మార్ట్ సిటీ జాబితాలో చేర్చిన పుణ్యం కూడా ఆయనదే! కేవలం వెంకయ్యనాయుడు ప్రోద్బలంతోనే, ఆయనతో వున్న భవిష్యత్ అవసరాల దృష్ట్యా చంద్రబాబు కూడా ఈమధ్య నెల్లూరు విషయంలో కొంత మెత్తబడి అభివృద్ధిపరమైన వాగ్దానాలు చేస్తున్నాడు. నెల్లూరుజిల్లా అభివృద్ధి పట్ల వెంకయ్యకు చిత్తశుద్ధి వుంది. చంద్రబాబు అదే చిత్తశుద్ధితో ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడితే నెల్లూరు నగరం మహానగరంగా కాకున్నా, ఓ మంచి నగరంగానన్నా మారుతుంది.



## నెల్లూరు అభివృద్ధి కోసం...

# అడ్డంకులు అధిగమిద్దాం!

- 'నెల్లూరు నెక్స్ట్' సభలో మంచి మార్గాన్ని సూచించిన వెంకయ్య
- ఆక్రమణల తొలగింపు రాజకీయాలపై నేతలకు చురకలు

విధాన నిర్ణయాలతో రాజీపడకుండా నెల్లూరు నగరాభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తేనే 'నెల్లూరు నెక్స్ట్' కల సాకారమవుతుంది. ఈ విషయంలో కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు సూచించిన మార్గం ఉత్తమంగా అనిపిస్తుంది. ఈ నెల 3వ తేదీన వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో 'నెల్లూరు నెక్స్ట్' కార్యక్రమాన్ని నిర్వహించగా, వెంకయ్యనాయుడుతో పాటు రాష్ట్రమంత్రి పి.నారాయణ, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మరికొందరు ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వెంకయ్య నెల్లూరులోని ఆక్రమణల విషయాన్ని ప్రదానంగా ప్రస్తావించారు. నీ అడ్డా... నా అడ్డా అని నాయకులు పేచీలు పెట్టుకుని ఆక్రమణలు తొలగించకపోతే ఈ నగరం ఎప్పటికీ బాగుపడదని, ఆక్రమణలు తొలగించాలనుకున్నాక అందరూ దానికి సహకరిస్తే నెల్లూరు బాగుపడు తుందన్నట్లు చెప్పారు. ఆయన చెప్పింది నూటికి నూరు శాతం వాస్తవమే. నవంబర్‌లో నెల్లూరును వరదలు ముంచెత్తాయి. నగరంలో వున్న పంట కాలువల ఆక్రమణల వల్లే నగరంలోని పలు ప్రాంతాలు మనకకు గురయ్యాయని అధికారులు తేల్చారు. నగరంలో వున్న ఆక్రమణలన్నింటిని తొలగించాలని సీఎం చంద్రబాబే ఆదేశించారు. అప్పటికప్పుడు పెద్దఎత్తున ఇతర ప్రాంతాల నుండి సర్వేయర్లను దించి ఆక్రమణల తొలగింపుకు మార్కింగ్ ఇచ్చారు. ఆ తర్వాత దీనిపై రాజకీయ ఆరోపణలు, పేచీలు మొదలయ్యాయి. ఆక్రమణల తొలగింపు పర్వం పక్కనపడిపోయింది.

గతంలో నెల్లూరులోని ట్రంకురోడ్డును వంద అడుగుల వెడల్పు చేయాలని భారీఎత్తున కసరత్తు చేశారు. ఆరోజు కూడా రాజకీయ వివాదాలు రేగడం, కొందరు ఆందోళనకు దిగడంతో అది మరుగునపడి ట్రంక్‌రోడ్డు మీద ట్రాఫిక్ దౌర్భాగ్యం అలాగే వుంది. నెల్లూరు నగరానికి సంబంధించి అభివృద్ధి ప్రక్రియకు రాజకీయ అవాంతరాలెదురవుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకునే వెంకయ్యనాయుడు 'నెల్లూరు నెక్స్ట్' కార్యక్రమంలో 'నీ అడ్డా... నా అడ్డా' అంటే కుదరదని హెచ్చరించినట్లు తెలుస్తోంది. నెల్లూరుజిల్లాకు కొన్ని అభివృద్ధి పనులు రావడంతో పాటు కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ పరిధిలో నెల్లూరును కలిపే ఆలోచన వుందని, ఇది జరిగితే నెల్లూరుకు 20వేల కోట్ల పెట్టు బడులు వస్తాయని ఆయన చెప్పుకొచ్చారు. అభివృద్ధి పరంగా మనం ఒకడుగు ముందుకు వేయాలను కున్నప్పుడు అందుకు అనుగుణంగా మార్గాన్ని నిర్మించుకోవాలి.

వెంకయ్య సూచించినట్లుగా నగరంలో ఆక్ర మణల తొలగింపు లాంటివాటిని విజయవంతంగా పూర్తి చేయగలిగితే అభివృద్ధి పరంగా నెల్లూరు నెక్స్ట్ స్టెప్ వేయగలదు.

# గాన గంధర్వుడికి 'స్వర కళా సామ్రాట్' కిరీటం

తన గంధర్వగానంతో ప్రేక్షకలోకాన్ని ఉర్రూతలూగిస్తున్న ప్రసిద్ధ గాయకుడు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) కీర్తికిరీటంలో మరో అనర్ఘ రత్నం వచ్చి చేరింది. ఎంతో ప్రతిష్టాత్మకమైన 'స్వర కళా సామ్రాట్' బిరుదు ఆయనకు లభించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా ఈ బిరుదును ప్రదానం చేసి బాలూను ఘనంగా సత్కరించారు. ఈ నెల 2వ తేదీన విశాఖ ఉత్సవ్ సందర్భంగా విశాఖపట్టణంలో భారీఎత్తున జరిగిన సభలో బాలూకి ఈ ఘనకీర్తి లభించింది. 1966 డిసెంబర్ 15వ తేదీన ఆయన పాట తొలిసారిగా రికార్డింగ్ జరిగింది. శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న చిత్రంలో 'ఏమి ఈ వింతమోహం' అనే పాటతో సినీరంగంలో నేపథ్యగాయకునిగా ఆరంగేట్రం చేసిన బాలూ, ఇప్పటిదాకా దాదాపు 50వేలకు పైగా పాటలు పాడి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. ఒకే ఒక్కరోజులో 19 తమిళ పాటలూ, 16 హిందీ పాటలూ పాడిన ఏకైక గాయకుడిగా ఆయన ప్రసిద్ధి చెందారు. తెలుగుసినీరంగంలో ఆయన పాడిన పాటలకు లెక్కే లేదు. పాడితే ఈ పాట బాలూయే పాడాలి అన్నట్లుగా ఆయన పాటలెన్నో ప్రసిద్ధి చెందాయి. శంకరాభరణం, రుద్రవీణ, సాగరసంగమం వంటి చిత్రాలకు ఆయన పాడిన పాటలు అన్నీ అద్భుతాలే. ఎన్నో చిత్రాల్లో ఆయన పాడిన మధురగీతాలు, భక్తిగీతాలు, దేశభక్తి గీతాలు



నేటికీ ప్రజలను అలరిస్తూనే వున్నాయి. తెలుగు భాష ఖ్యాతిని, తెలుగుజాతి విఖ్యాతిని విశ్వవ్యాప్తం చేస్తూ ఆయన ఎన్నో పాటలు పాడడమేకాక, ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే ఎన్నో సంగీత కార్యక్రమాల్లో ఆయన వర్ధమాన గాన కళాకారులను కూడా ఎంతగానో ప్రోత్సహిస్తూ అందరి ప్రశంసలూ అందుకుంటూనే వున్నారు. వీనుల విందు చేసే ఆయన గంధర్వగానం ఇప్పటికే ఆయనకెన్నో విశిష్టమైన అవార్డులూ, ఘనపురస్కారాలూ తెచ్చిపెట్టింది. ఇప్పుడు తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి మరో ఆణిముత్యం వంటి 'స్వర కళా సామ్రాట్' బిరుదు లభించడం ఆయన గాన కళాకౌశలానికి నిదర్శనం. ఈ బిరుదు ప్రదానోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు ఈ బిరుదును ప్రదానం చేయడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. బాలూకి ఎవరూ పోటీ లేరని, ఆయనకు ఆయనే పోటీ అని ముఖ్యమంత్రి కొనియాడారు. అనంతరం బాలూకి స్వర కళా సామ్రాట్ బిరుదుతో పాటు, అన్నమయ్య విగ్రహాన్ని, ప్రశంసాపత్రాన్ని కూడా బహూకరించి, ఘనంగా సన్మానించారు. బాలూ మాట్లాడుతూ, ఎంతో విశిష్టమైన 'స్వర కళా సామ్రాట్' బిరుదును రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అందుకోవడం తనకు మరువలేని అనుభూతి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆపరేషన్.. వైసిపి లీడర్స్

- తెరపైకి మళ్ళీ నకిలీ మద్యం కేసు
- రాజకీయాల్లో ఇదో తిరకాసు

ఏ పార్టీ నుండి నాయకులు వస్తున్నా చేర్చుకోవాలని చంద్రబాబు తన పార్టీ జిల్లా నాయకులకు సూచించాడు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని తుడిచిపెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్న చంద్రబాబు, ఆ దిశగా సామ దాన దండోపాయాలు ప్రయోగిస్తున్నాడు. మంచిగా వచ్చేవారిని ఓ పక్క చేర్చుకోవడానికి బాటలు ఏర్పరుస్తూనే, ఇంకోపక్క వైకాపాను వదిలిరాని వారికోసం దండోపాయ మార్గాన్ని ఎంచుకున్నాడు. వైకాపాకు చెందిన నాయకులపై వున్న కేసులను తిరగదోడడం, లేదా అధికార బలంతో వారిని లొంగదీసుకోవడం వంటి ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. నెల్లూరుజిల్లాలో ఎన్నికలనాటి మద్యం కేసును తిరగతోడడం ఈ కోవకు చెందిందిగానే భావిస్తున్నారు.

దాదాపు ఒకటిన్నర సంవత్సరం క్రితం నెల్లూరుజిల్లాలో సంచలనం రేపిన నకిలీ మద్యం కేసులు మళ్లీ రగులుకుంటున్నాయి. సిఎం చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఈ నెల 3న కావలిలో బస చేశారు. దీంతో తెలుగుదేశంపార్టీ నాయకులు ఎన్నికల నకిలీ మద్యం కేసుల గురించి వివిధ కారణాలతో జిల్లాలో మద్యం కేసులను నీరుగార్చారని సూత్రధారులను అరెస్టు చేయాలని సిఎంకు ఫిర్యాదు చేశారు. విచారణను సిబిసిఐడికి అప్పగించిన కేసుల్లో ఎలాంటి పురోగతి లేదని వివరించారు. నకిలీ మద్యం కేసుల్లో నిందితులుగా వున్న వైయస్సార్సీపీ నాయకులు తెలుగుదేశంపార్టీ కార్యకర్తలను, అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సిఎంకు వివరించినట్లు సమాచారం. దీంతో తిరిగి ఈ కేసులను విచారించాలని సిఎం పోలీసు శాఖను ఆదేశించడంతో వైకాపాలో మళ్ళీ అలజడి మొదలైంది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరుజిల్లాలో సర్వేపల్లి, కావలి, నెల్లూరురూరల్, ఆత్మకూరు, కోవూరు, గూడూరు నియోజకవర్గాల్లో భారీగా మద్యం నిల్వలు దొరికాయి. ముత్తుకూరులో 16వేల సీసాలను పట్టుకున్నారు. కావలిలో 2లారీల మద్యం దగ్ధం చేయగా మిగిలిన 5500 సీసాలు దొరికాయి. గోవా, హిమాచల్‌ప్రదేశ్‌లో తయారైన బ్రాండ్లుగా గుర్తించారు. వీటిపై కావలి, నెల్లూరురూరల్, గూడూరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. నకిలీ మద్యం కారణంగా జిల్లాలో ముగ్గురు మరణించారు. పలువురు అనారోగ్యానికి గురయ్యారు. నకిలీ మద్యం కేసులపై విమర్శలు రావడంతో మళ్ళీ దర్యాప్తు చేయాలని ఆదేశాలు వచ్చాయి. గతంలో అధికారపార్టీకి చెందిన ఒక ముఖ్యనేత జోక్యంతో మద్యం కేసుల దర్యాప్తుకు గండి పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితులు ఇచ్చిన వాగ్మూలం ప్రకారం పూర్తిగా దర్యాప్తు కొనసాగలేదు. తమిళనాడుకు చెందిన అప్పు అనే వ్యక్తి ప్రదాన నిందితుడిగా ఉన్నారు. ఈయనతో పాటు నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తి కీలకంగా ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. తర్వాత అప్పు జైలులోనే మరణించాడు.

అయితే వైసిపి ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకుని ఈ మద్యం కేసును మళ్ళీ లేవగొట్టారని, వైకాపా నాయకులను తమ దారికి తెచ్చుకోవడానికే అధికార పార్టీ నాయకులు ఇలా చేస్తున్నారని ఊహాగానాలు వినవస్తున్నాయి.

శుభాభినందనలు



మంచి మాటలతో, మంచి మనసుతో మమ్మల్ని ముందుకు నడిపిస్తూ...
మాకు మార్గదర్శకుడిగా నిలుస్తున్న మా ఆత్మీయుడు
శ్రీ పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి గారు
విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన
శుభసందర్భంగా మా హృదయపూర్వక శుభాకాంక్షలు.


యం.రామసుబ్బారెడ్డి


ఎ.హజరత్తయ్య


ఎస్.శంకర్‌రెడ్డి

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com